
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

కృష్ణా జిల్లా వార్తలు

బుధవారం 6 ఆగస్టు 2025





గుడ్లవల్లేరు లాకుల వద్ద నీటిని పరిశీలిస్తున్న మంత్రి రామానాయుడు, చిత్రంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, నీటి సంఘాల అధ్యక్షులు

కృష్ణా డెల్టాలో చివరి ఎకరాకు నీరు

- మంత్రి నిమ్మల రామానాయుడు
- గుడివాడ, పెడన నియోజకవర్గాల్లో సాగునీటి కాలువలు, డ్రెయిన్ల పరిశీలన
- నిర్వహణ సరిగా లేకపోవడంతో ఇరిగేషన్ అధికారులపై మంత్రి ఆగ్రహం

8

రికార్డులను సమర్థవంతంగా నిర్వహించాలి : ఎస్పీ గంగాధరరావు

6



ప్రజా సేవకు సంజీవని



మల్లవల్లి పారిశ్రామికవాడలో రూపుదిద్దుకుంటున్న సంజీవని వాహనాలు

మల్లవల్లి పారిశ్రామికవాడలో సిద్ధమవుతున్న 104 వాహనాలు

పేదలకు 47 రకాల సేవలు అందించేలా రూపకల్పన

(ఆంధ్రజ్యోతి, హనుమాన్‌జంక్షన్ రూరల్): పల్లెల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. గత వైసీపీ ప్రభుత్వంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన 108, 104 వాహనాలకు జీవం పోసేందుకు సిద్ధమైంది. సంజీవని పేరుతో ప్రజల వద్దకు 104 వాహనాలను తీసుకురానుంది. దీనికి సంబంధించిన ప్రక్రియ మల్లవల్లి పారిశ్రామికవాడలో చురుగ్గా జరుగుతోంది. ప్రకాశవంతమైన పసుపు, ఎరుపు రంగుల్లో ఆకర్షణీయంగా సంజీవని వాహనాలను తయారు చేస్తున్నారు. విజయవాడకు చెందిన భవ్య హెల్త్ కేర్ సర్వీసెస్ వారి ఆధ్వర్యంలో సంజీవని వాహనాలు నూతన రూపు సంతరించు కుంటున్నాయి. 104 వాహనంలో 47 రకాల రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించేలా అత్యాధునిక సాంకేతిక పరికరాలను కూడా అమరుస్తున్నారు. ఆరోగ్య సమాచారం, తల్లీబిడ్డ ఆరోగ్య సంరక్షణ వంటి వైద్య సేవలతో పాటు తాగునీటి పరీక్షలు నిర్వహించేందుకు అవసరమైన వ్యవస్థను కూడా సిద్ధం చేస్తున్నారు. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు లోకేశ్, సత్యకుమార్ చిత్రాలతో కూడిన సంజీవని వాహనాలు త్వరలో ప్రజాసేవ చేసేందుకు గ్రామాలకు రానున్నాయి.

డ్రెయినేజీలో అవినీతి జలగలు

గుడివాడ డ్రెయినేజీ శాఖ ఈఈ కార్యాలయం అవినీతి కంపుకొడుతోంది. గత వైసీపీ ప్రభుత్వంలో ఇక్కడకు వచ్చిన ఇద్దరు అధికారులు జలగలుగా మారి కాంట్రాక్టర్లను పీల్చివేస్తున్నారు. ఏ పని అవ్వాలన్నా చేయి తడపాల్సిందే.. లేదంటే ఫైల్ ముందుకు కదలని పరిస్థితి. బిల్లుల మంజూరు వ్యవహారంలో ఒకశాతం కమీషన్‌ను ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా వైసీపీ అనుకూల కాంట్రాక్టర్‌లకు పెద్దపీట వేస్తున్నారు. ఓ ఉన్నతాధికారి కనుసన్నల్లోనే ఈ వ్యవహారాలు జరుగుతున్నట్టు విమర్శలు వస్తున్నాయి.

గుడివాడ డ్రెయినేజీశాఖ ఈఈ కార్యాలయంలో లంచావతారులు!

వైసీపీ హయాంలో వచ్చి పాతుకుపోయిన ఇద్దరు అధికారులు

- ఏ పని అవ్వాలన్నా చేయి తడపాల్సిందే.. లేదంటే పెండింగ్‌లోనే ఫైల్స్
- బిల్లులో ఒక శాతం ఇవ్వాలని కాంట్రాక్టర్లపై ఒత్తిడి!
- అంతా ఒక ఉన్నతాధికారి కనుసన్నల్లోనే వ్యవహారాలు!

ఆంధ్రజ్యోతి-గుడివాడ: గుడివాడ పట్టణంలో డ్రెయినేజీశాఖ ఈఈ కార్యాలయం ఉంది. దీని గురించి ప్రజాప్రతినిధులు, కాంట్రాక్టర్లకు తప్ప సామాన్య ప్రజలకు పెద్దగా తెలియదు. ఇక్కడ పనిచేస్తున్న అధికారుల రూటే సపరేటు'. ఏ పని చేయాలన్నా చెయ్యి తడపాల్సిందే. లేదంటే వీరి ప్రతాపాన్ని చూపుతారు. గత వైసీపీ హయాంలో ఇద్దరు ఉద్యోగులు బదిలీపై ఇక్కడకు వచ్చారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఒకే మాటగా వీరిద్దరూ చెలరేగిపోతున్నారు. కొత్త ఎం.బుక్‌కు నెంబరింగ్ వేయాలన్నా లంచం ఇచ్చుకోవాల్సిందే. పని తాలుకు బిల్లులకు మాత్రం ఖచ్చితంగా ఒక శాతం వీరికి చెల్లించాల్సిందే. ఇవ్వకుంటే కాంట్రాక్టర్‌లకు చుక్కలు చూపిస్తారని సమాచారం. లంచంగా వచ్చిన మొత్తంలో ఇద్దరు చెరి సగం పంచుకుంటారని తెలిసింది. వీరి అవినీతి మిగతా 6లో..





గుడివాడలోని డ్రెయినేజీశాఖ ఈఈ కార్యాలయం

అందినకాడికి దోపిడీ!

డ్రెయినేజీశాఖలో కాంట్రాక్టు దక్కించుకున్న వారికి అదనపు ఖర్చు తప్పదు. ముఖ్యంగా ఎం.బుక్‌లను కాంట్రాక్టర్ కొనుగోలు చేసుకోవాలి. దానికి నెంబరింగ్ వేయాలన్న సదరు అధికారి చేతులు తడపాలి. చేసిన పనిని ఎం.బుక్‌లో రికార్డు చేయాలంటే ప్రైవేటు వ్యక్తులతో చేయిస్తారు. సదరు వ్యక్తికి పనిని బట్టి రూ.5వేల నుంచి రూ.20వేల వరకు కాంట్రాక్టర్ చెల్లించాలి. బిల్లులను అప్లోడ్ చేయాలంటే ఎం.బుక్ కావాల్సిందే. దీనికి సదరు ఉద్యోగికి ఒక శాతం రొక్కం చెల్లించాలి. బిల్లు చెల్లింపు తర్వాత తమ డిపాజిట్‌లను వెనక్కి తీసుకోవాలంటే కూడా ఎం.బుక్ అవసరముంటుంది. మళ్లీ చెయ్యి తడిపితేనే ఎం.బుక్ కాంట్రాక్టర్ చేతికి వస్తుంది. ఈ విధంగా డ్రైనేజీ శాఖలో అందిన కాడికి దోచుకుంటున్నారు.

చర్యలకు సిద్ధం!

వైసీపీ హయాంలో గుడివాడ ఏరియా ఆస్పత్రిలో అక్రమాలు

- 2020లో క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక ఇచ్చిన ఏసీబీ అధికారులు
- ఐదేళ్లుగా చర్యలు తీసుకోకుండా తొక్కిపెట్టిన అధికారులు
- దీనిపై స్పందించిన వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్
- 11 మందిపై విచారణకు మంగళవారం ఆదేశాలు జారీ



గుడివాడ ఏరియా ప్రభుత్వాసుపత్రి భవనం

ఆంధ్రజ్యోతి - గుడివాడ: గత వైసీపీ ప్రభుత్వంలో గుడివాడ ఏరియా ప్రభుత్వాస్పత్రిపై అనేక అవినీతి ఆరోపణలు వచ్చాయి. ముఖ్యంగా కరోనా సమయంలో దాతలు ఇచ్చిన వస్తువులు, దుప్పట్లు, మాస్కులు, శానిటైజర్‌లు, ఆక్సిజన్ పరికరాలు, నగదుతో కొనుగోలు చేసిన బెడ్‌లు తదితరాల్లో అవకతవకలు జరిగినట్టు ఆరోపణలు ఉన్నాయి. వీటిపై 2020లో ఏసీబీ అధికారులు రెండు రోజులపాటు ఆస్పత్రిలో తనిఖీలు చేసి నివేదికను ప్రభుత్వానికి సమర్పించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా ఇందిరాదేవి గత వైసీపీ ప్రభుత్వం నుంచి నేటి వరకు కొనసాగుతున్నారు. కరోనా సమయంలో అప్పటి మంత్రి కొడాలి నాని కార్యాలయం నుంచి వచ్చిన సిఫార్సులకే ప్రథమ ప్రాధాన్యతనిచ్చి బెడ్‌లను కేటాయించారు. అప్పటి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఆళ్ల నాని, మంత్రి కొడాలి నానిలపై కూడా ఆరోపణలున్నాయి. అందుకే ఏసీబీ అధికారులు ఇచ్చిన నివేదికపై ఎటువంటి చర్యలు తీసుకోకుండా మాజీ మంత్రి కొడాలి నాని చక్రం తిప్పి నిలుపుదల చేయించినట్టు సమాచారం.

అంతా మాజీ మంత్రి కనుసన్నల్లోనే..

అవినీతి ఆరోపణలు ఉన్న సూపరింటెండెంట్, వైద్యులపై చర్యలు తీసుకోకుండా అప్పటి మంత్రి కొడాలి నాని చక్రం తిప్పారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు నానికి విశ్వాసపాత్రులుగా వ్యవహరించడంతోనే అప్పటి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఆళ్ల నానిపై ఒత్తిడి తీసుకువచ్చి చర్యలకు ఉపక్రమించకుండా నిలుపుదల చేసినట్లు సమాచారం. కరోనా సమయంలో మంత్రి క్యాంపు కార్యాలయం, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు సిఫారసు చేసిన వారికే బెడ్‌లను సమకూర్చారు. బెడ్‌లు అందుబాటులో లేకపోవడంతో వందలాది మంది ప్రాణాలు కోల్పోయారు. ప్రత్యేకంగా దాతలిచ్చిన పరికరాలు, బెడ్‌లు, నగదు, వస్తువులు పక్కదారి పట్టినట్టు సమాచారం.

11 మందిపై విచారణకు మంత్రి ఆదేశం

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో వివిధ ప్రభుత్వాస్పత్రుల్లో నెలకొన్న అక్రమాలపై చర్యలకు రాష్ట్ర మంత్రి సత్యకుమార్ ఆదేశాలిచ్చారు. అనకాపల్లి ప్రభుత్వాస్పత్రిలో 2020లో ఏసీబీ జరిపిన మరో తనిఖీలో నివేదిక ఆధారంగా మంత్రి సత్యకుమార్ జూలై 27వ తేదీన 22 మంది వైద్యులు, ఇతర సిబ్బందిపై విచారణకు ఆదేశించారు. ఇది జరిగి రెండు వారాలు తిరగకముందే గుడివాడ ఏరియా ప్రభుత్వ ఆస్పత్రిలో జరిగిన అవకతవకలపై నాటి ఏసీబీ అధికారుల నివేదిక ఆధారంగా చర్యలకు ఉపక్రమించారు. ఏసీబీ నివేదిక ఇచ్చి ఐదేళ్లు గడుస్తున్నా చర్యలు తీసుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పటి ఆస్పత్రి సూపరింటెండెంట్, ఆరుగురు వైద్యులు, పరిపాలనాధికారి(ఏవో), ఇద్దరు నర్సింగ్ సూపరింటెండెంట్‌లు, ఫార్మసిస్టులపై విచారణకు మంత్రి సత్యకుమార్ మంగళవారం ఆదేశాలిచ్చారు. ఆస్పత్రి నిర్వహణకు సంబంధించి 2014-19 కాలంలో వచ్చిన అంతర్గత ఆడిట్ నివేదికలపై చర్యలు తీసుకోకపోవడంపై సీరియస్ అయ్యారు.

లోతైన పరిశీలన

అవినీతి నిరోధక శాఖ అధికారులు 2020లో రెండు రోజులపాటు ఏరియా ఆస్పత్రి నిర్వహణ, పరిశుభ్రత, అంతర్గత ఆడిట్ రిపోర్టులపై తీసుకున్న చర్యలు, రోగులకు అందించే భోజనంలో నాణ్యత, మందుల నాణ్యత, సరఫరా, స్టాకు వివరాలు, నియమాల ప్రకారం వైద్య సిబ్బంది పాటించాల్సిన డ్రెస్ కోడ్ వంటి వాటిపై లోతైన పరిశీలన చేశారు. అప్పటి వైద్య సిబ్బందిని పలు అంశాలపై నేరుగా ప్రశ్నించారు. వివిధ స్థాయిల్లో పర్యవేక్షణ లోపాన్ని అప్పటి ఏసీబీ అధికారులు ఎత్తిచూపారు. రోగ నిర్ధారణ పరీక్షల కోసం వాడే పలు రకాల కిట్లు, గ్లౌజులు పంపు షెడ్డు, ప్లంబర్ రూమ్, ఇతర చోట్ల చెల్లాచెదురుగా పడి ఉండటాన్ని గమనించారు. దీర్ఘకాలంగా రాష్ట్ర మిగతా 6లో..



ఎరువు.. బరువు

పెరుగుతున్న కాంప్లెక్స్ ఎరువుల ధరలతో రైతుల అవస్థలు

మూడేళ్లుగా పెంపు.. బస్తాకు రూ. 250 వరకు అదనపు ఖర్చు

(ఆంధ్రజ్యోతి, ఇబ్రహీంపట్నం) : ఏటా పెరుగుతున్న కాంప్లెక్స్ ఎరువుల ధరలు రైతులకు అదనపు భారమవుతున్నాయి. మూడేళ్లుగా ధరలు పెరుగుతూనే ఉన్నాయి. ఉమ్మడి కృష్ణాజిల్లాలో సుమారు లక్షన్నర ఎకరాల్లో వరి, వేలాది ఎకరాల్లో పత్తి, ఇతర పంటలు సాగవుతున్నాయి. ఇప్పటికే 60 శాతం వరినాట్లు పూర్తిచేశారు. దీంతో పంటకు కావాల్సిన ఎరువుల కొనుగోళ్లు వేగం పుంజుకున్నాయి. అయితే, పెరిగిన మిగతా 6లో..

అదనపు భారమే..

ఎకరం వరి కలుపుతీత, పొట్టదశ తదితర సమయాల్లో యూరియా కాకుండా మూడు దఫాలుగా మరో మూడు బస్తాల వరకు కాంప్లెక్స్ ఎరువులు వేస్తారు. పెరిగిన ధరలను బట్టి చూస్తే ఒక్కో ఎకరాకు రూ.1,200 వరకు అదనపు భారం తప్పదు. జిల్లా మొత్తంగా సాగైన వరి, పత్తి విస్తీర్ణాన్ని బట్టి చూస్తే రైతులపై అదనంగా రూ.10 కోట్ల భారం పడుతుంది.

సర్వర్ సమస్య

నిలిచిన తపాలా సేవలు

- కొత్త సాఫ్ట్‌వేర్‌తో అవస్థలు
- విజయవాడ రీజియన్‌లో మొదలైన కాసేపటికే డౌన్
- నగరంలోని పోస్టాఫీసుల్లో ఖాతాదారుల అగచాట్లు



బకింగ్‌హాంపేట పోస్టాఫీసులో ఖాతాదారుల క్యూ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : సర్వర్లు మొరాయించటంతో ఉమ్మడి కృష్ణాజిల్లావ్యాప్తంగా మంగళవారం తపాలా సేవలు నిలిచిపోయాయి. ఈ సమస్య మరో పది రోజులకు పైగా ఉండొచ్చని తపాలా శాఖ అధికార వర్గాలు చెబుతున్నాయి. జూన్ 25న దేశవ్యాప్తంగా నూతన సాఫ్ట్‌వేర్‌ను అమల్లోకి తీసుకొచ్చారు. దశలవారీగా అన్ని పోస్టాఫీసుల్లోనూ ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నారు. మంగళవారం నుంచి విజయవాడ రీజియన్ పరిధిలో కూడా అమలు చేశారు. అయితే, ఈ నూతన సాఫ్ట్‌వేర్‌లో సాంకేతిక సమస్యలు ఏర్పడ్డాయి. సర్వర్ మొరాయించింది. నెట్‌వర్క్ సరిగ్గా పనిచేయలేదు. నగరంలోని బకింగ్‌హాంపేట హెడ్‌పోస్టాఫీసు నిత్యం రద్దీగా ఉంటుంది. ఉదయం నుంచి సేవలు నిలిచిపోవటంతో తపాలా ఖాతాదారులు ఇబ్బందులు పడ్డారు. పోస్టల్ ఇన్సూరెన్స్ స్కీమ్‌లు, పోస్టల్ డిపాజిట్స్ స్కీమ్‌లు, పోస్టల్ సేవింగ్స్ స్కీమ్‌లు, సుకన్య సమృద్ధి యోజన, ఇతర అనేక సేవింగ్స్ స్కీమ్‌లకు సంబంధించి లావాదేవీలు, నగదు విత్‌డ్రా చేయడానికి పెద్ద ఎత్తున పోస్టాఫీసుకు సందర్శకులు వస్తుంటారు. సాఫ్ట్‌వేర్, నెట్‌వర్కింగ్, సర్వర్ సమస్యల కారణంగా రోజంతా ఇబ్బందులు పడ్డారు. అత్యవసర లావాదేవీల కోసం వచ్చినవారు మాత్రం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వేచి చూశారు. బకింగ్‌హాం పోస్టాఫీసు, వన్‌టౌన్, గాంధీనగర్ పోస్టాఫీసుల్లో ఖాతాదారులు ఇబ్బందులు పడ్డారు.

టెక్నీషియన్లేరీ?

- మచిలీపట్నం, బెజవాడ ప్రభుత్వ ఆస్పత్రుల్లో పురుషులతో మహిళలకు ఈసీజీ, 2డి ఎకో పరీక్షలు
- తీవ్ర అసౌకర్యానికి గురవుతున్న మహిళలు, యువతులు
- మచిలీపట్నంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన బాధితురాలు
- 'ఆంధ్రజ్యోతి' విజిట్‌లో వెలుగు చూసిన దయనీయ పరిస్థితి

6



విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో మహిళకు ఈసీజీ పరీక్షలు నిర్వహిస్తున్న పురుష టెక్నీషియన్

బందరులో గ్రీన్ ఎనర్జీ ప్లాంట్ ఏర్పాటుకు కృషి

- జేకేఎస్ఎస్ సంస్థ ప్రతినిధులతో మంత్రి కొల్లు రవీంద్ర

8

టెక్నీషియన్లేరీ?

- అత్మాభిమానాన్ని చంపేస్తున్నారు!
- బెజవాడ కొత్త ప్రభుత్వాసుపత్రిలో పురుష సిబ్బందితో మహిళలకు ఈసీజీ, 2డి ఎకో పరీక్షలు
- కార్పొరేట్ వైద్యం కొనలేక.. ఇక్కడ సిగ్గుతో చచ్చిపోతున్నాం
- తీవ్ర అసౌకర్యానికి లోనవుతున్న మహిళలు
- దారుణంపై మచిలీపట్నంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన బాధితురాలు
- 'ఆంధ్రజ్యోతి విజిట్'లో వెలుగు చూసిన దయనీయ దుస్థితి

ఆంధ్రజ్యోతి విజిట్



విజయవాడ కొత్త ప్రభుత్వాసుపత్రిలో మహిళలకు ఈసీజీ పరీక్షలు నిర్వహిస్తున్న పురుష టెక్నీషియన్

హృద్రోగ సమస్యల ధ్రువీకరణ కోసం ఉమ్మడి కృష్ణా జిల్లా ప్రభుత్వాసుపత్రుల్లో నిర్వహించే ఈసీజీ, 2డి ఎకో పరీక్షలు పేద, మధ్య తరగతి మహిళల ఆత్మాభిమానాన్ని చంపేస్తున్నాయి. పురుష సిబ్బంది ఎదుట జాకెట్ విప్పి ఛాతిని చూపాల్సి రావటం అత్యంత దారుణం. ఖరీదైన వైద్యాన్ని అందుకోలేక.. ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లలేక ప్రభుత్వాసుపత్రులకు వచ్చే మహిళలు సిగ్గు విడవాల్సి వస్తోంది. ఇక్కడి సిబ్బందిని కూడా నిందించలేని పరిస్థితి. పరీక్షలు నిర్వహించే వారికి.. చేయించుకునే వారికి నిత్య సంకటంగా మారుతోంది. విజయవాడ నగరంలో న్యూ జీజీహెచ్, మచిలీపట్నం జీజీహెచ్‌లలో ఈ దారుణాలు చోటు చేసుకుంటున్నాయి. మచిలీపట్నం ఆసుపత్రిలో జరుగుతున్న దారుణాన్ని ఓ మహిళ ధైర్యంగా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో, ప్రభుత్వ ఆసుపత్రుల్లో 'ఆంధ్రజ్యోతి విజిట్' నమ్మలేని నిజాలు వెలుగుచూశాయి.



మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రి పరీక్షా కేంద్రంలో రోగులు

విజయవాడ/ప్రభుత్వాసుపత్రి/మచిలీపట్నం టౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : కోస్తా జిల్లాలకే తలమానికంగా నిలుస్తున్న కొత్త ప్రభుత్వ ఆసుపత్రి రోజురోజుకు తీవ్ర విమర్శలను ఎదుర్కొంటోంది. పలు విభాగాల్లో మహిళా రోగులకు వైద్య పరీక్షలను పురుష సిబ్బందే నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా 2డి ఎకో, ఈసీజీ టెస్టులను పురుష సిబ్బంది నిర్వహిస్తుండటంతో మహిళలు చెప్పలేని మానసిక వేదన ఎదుర్కొంటున్నారు. ఈ పరీక్షల కోసం జిల్లాతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో రోగులు వస్తుంటారు. వీరిలో సగానికిపైగా మహిళలు ఉంటున్నారు. వీరికీ పురుష సిబ్బందే వైద్య పరీక్షలు చేస్తుండడంతో మహిళలు తీవ్ర అసౌకర్యానికి లోనవుతున్నారు. సిబ్బందికి తమ బాధను చెప్పుకోలేక, అలాగని పరీక్షలు చేయించుకోలేక ఎంతోమంది సతమతమౌతున్నారు.

పరీక్షల సమయంలో మహిళల ఇబ్బందులు

ఎకో, ఈసీజీ పరీక్షలు నిర్వహించే సమయంలో కొన్ని సందర్భాల్లో తీవ్ర అసౌకర్యానికి మహిళలు గురవుతున్నారు. కొన్ని సందర్భాల్లో పై వస్త్రాలు తీసివేసి స్కానింగ్ చేయాల్సి ఉంటుంది. పురుష సిబ్బందే స్కానింగ్ తీయాల్సిన పరిస్థితిలో రోగులు అసౌకర్యానికి గురవుతున్నారు.

ఇద్దరు మహిళలు.. ఐదుగురు పురుష టెక్నీషియన్లు

కొత్త ఆసుపత్రిలో కొన్ని విభాగాల్లో సిబ్బంది కొరతతో ఉన్నవారిపైనే పనిభారం పెరుగుతోంది. ఆసుపత్రిలో ఎకో, ఈసీజీ పరీక్షా కేంద్రాల వద్ద ఇద్దరు మహిళా సిబ్బంది ఉన్నారు. వారిలో ఒకరు సూపర్ బ్లాక్‌లో ఉంటే మరొకరు జీజీహెచ్‌లో ఉంటారు. సూపర్‌బ్లాక్‌లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ పరీక్షలు నిర్వహిస్తారు. జీజీహెచ్‌లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహిస్తారు. ఉదయం షిఫ్ట్‌లో పనిచేసే మహిళా సిబ్బంది మధ్యాహ్నానికి అందుబాటులో ఉండరు. మధ్యాహ్నం పురుష సిబ్బంది తీయాల్సిన పరిస్థితి. దీంతో పురుష సిబ్బంది మహిళలకు పరీక్షలు చేసే సమయంలో తమ మీద ఎలాంటి ఆరోపణలు వస్తాయోనన్న భయంతో రోగులకు సంబంధించి సహాయకులు పక్కన ఉంటేనే పరీక్షలు నిర్వహిస్తామంటున్నారు. సహాయకులు అందుబాటులో లేని మహిళా రోగులకు పరీక్షలు ఆలస్యమౌతున్నాయి. దీంతో అటు రోగులు, ఇటు సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు.

మచిలీపట్నంలో పరీక్షలపై యువతి ఆగ్రహం

మహిళలకు పురుష టెక్నీషియన్లు 2డి ఎకో టెస్టులు చేస్తుంటే ఆత్మాభిమానం చంపుకోవాల్సి వస్తోంది. సిగ్గు విడిచి ఛాతీ చూపించాల్సి వస్తోందని కొందరు యువతులు మండిపడుతున్నారు. కృష్ణాజిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో మహిళలకు పురుష టెక్నీషియన్లు 2డి ఎకో టెస్టులు పరీక్షలు చేస్తుండటంపై పలు అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. తమ శరీరాన్ని 2డి పరీక్షల సమయంలో పురుషుల ముందు ప్రదర్శించాల్సిన దుస్థితి ఏర్పడిందంటూ కొందరు మహిళలు మీడియా ఎదుట వాపోయారు. 2డి పరీక్షలకు మహిళా టెక్నీషియన్లను నియమించాలంటూ బాధితులు గగ్గోలు పెట్టారు. అధికారులకు ఫిర్యాదు చేశారు.

సిబ్బంది కొరతతోనే..

- సూపరింటెండెంట్ డాక్టర్ ఆశాలత

మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో 2డి ఎకో టెస్ట్ రిక్రూట్‌మెంట్ సమయంలో మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి ఇద్దరు పురుష టెక్నీషియన్లు మాత్రం ఇచ్చారు. మహిళా టెక్నీషియన్లను ఇవ్వలేదు. దీంతో ఈ పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం ఒక నర్సును 2డి ఎకో టెస్ట్ సమయంలో ఉంచుతున్నాం. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి మహిళా టెక్నీషియన్‌ను నియమించేందుకు కృషి చేస్తాం.



మచిలీపట్నం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో 2డి ఎకో పరీక్షల కేంద్రం, పరీక్షా కేంద్రంలో పురుష సిబ్బంది



మంత్రి అచ్చెన్నాయుడు దంపతులకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో, అర్చకులు

దుర్గమ్మ సేవలో మంత్రి అచ్చెన్న దంపతులు

ఇంద్రకీలాద్రి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు మంగళవారం సతీమణితో కలిసి విజయవాడ ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. ఈవో వీకే శీనానాయక్, సిబ్బంది, అర్చకులు వారికి సాదర స్వాగతం పలికారు. మంత్రి అచ్చెన్నాయుడు దంపతులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి దర్శనానంతరం వారికి వేదపండితులు ఆశీర్వచనం అందజేశారు. అనంతరం లడ్డూ ప్రసాదం, అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రం అందజేశారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ గంగాధరరావు

రికార్డులను సమర్థవంతంగా నిర్వహించాలి

- ఎస్పీ గంగాధరరావు

మచిలీపట్నం క్రైమ్, అగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : సెక్షన్లవారీగా నిర్వహిస్తున్న ప్రతి రికార్డును క్షుణ్ణంగా పరిశీలించి అన్ని విభాగాలను సమన్వయపరచుకుంటూ ఎప్పటికప్పుడు డేటాను అప్‌డేట్ చేస్తూ ఉండాలని జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు పేర్కొన్నారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని క్రైమ్ రికార్డ్ బ్యూరో(డిసిఆర్‌బి) విభాగాన్ని ఆయన సందర్శించి విభాగపు పనితీరును సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నేరగాళ్ల వివరాలు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా సమగ్రంగా నమోదు చేయడం ద్వారా దర్యాప్తునకు ఎంతో దోహదపడుతుందన్నారు. నేరగమనాన్ని అంచనా వేసే విషయంలో డీసీఆర్బీ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. ఆయన వెంట సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

బస్‌స్టేషన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ జిల్లా పరిధిలోని తిరువూరు, జగ్గయ్యపేట, విజయవాడ, గవర్నర్‌పేట 1, గవర్నర్‌పేట 2, ఇబ్రహీంపట్నం, ఆటోనగర్, విద్యాధరపురం డిపోలలో రోజువారీ వేతనంపై ఆన్‌కాల్ డ్రైవర్లుగా పనిచేసేందుకు ఆసక్తి గల డ్రైవర్ల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.వై.దానం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులకు హెవీ డ్రైవింగ్ లైసెన్స్, ఏడాదిన్నర పాటు హెవీ వెహికల్ నడిపే అనుభవం, 59 సంవత్సరాల లోపు వయస్సు ఉండాలని తెలిపారు. అసిస్టెంట్ మెకానిక్, శ్రామికులుగా పనిచేసేందుకు ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా నియామకాలు జరుగుతాయన్నారు. శ్రామిక ఉద్యోగాలకు డీజిల్, మెకానిక్ ట్రేడ్‌లో ఐటీఐ పాసై, అప్రంటీస్ చేసి ఉండాలన్నారు. మరిన్ని వివరాలకు జిల్లా ప్రజా రవాణా అధికారి కార్యాలయంలో గాని, డిపోల మేనేజర్లు, కార్యాలయాల్లో గాని సంప్రదించవచ్చునని తెలిపారు. పీవో ఆఫీసు 9959225453 ఆటోనగర్ డిపో మేనేజర్ 9959225463, జగ్గయ్యపేట డిపో మేనేజర్ 9959225460, గవర్నర్‌పేట 2 డిపో మేనేజర్ 9959225456, విద్యాధరపురం డిపో మేనేజర్ 9959225458, విజయవాడ డిపో మేనేజర్ 9959225459, తిరువూరు డిపో మేనేజర్ 9959225465, గవర్నర్‌పేట 1 డిపో మేనేజర్ 9959225455, ఇబ్రహింపట్నం డిపో మేనేజర్ 9959225457లలో సంప్రదించవచ్చునని ఆయన సూచించారు.

ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ప్రభుత్వ పథకాలు వర్తింపచేయాలి

మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు రంగనాయకులు

విజయవాడ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ప్రభుత్వ పథకాలు వర్తింపచేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ఎ.రంగనాయకులు తెలిపారు. మంగళవారం సీడీఎంఏ పి.సంపత్‌కుమార్‌ను కలిసి కార్మికుల సమస్యలపై లేఖను అందజేశారు. కార్మికుల రిటైర్మెంట్ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలని, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరినట్టు తెలిపారు. కార్మికులకు ప్రభుత్వం ఇన్సూరెన్స్ పాలసీ చేయించి యాక్సిడెంట్‌లో చనిపోయిన వారికి రూ.20 లక్షలు, సాధారణంగా మరణించిన వారికి రూ.2 లక్షలు వచ్చేలా చేస్తామన్నారని రంగనాయకులు తెలిపారు. ప్రమాదానికి గురైనా కార్మికుల పిల్లల చదువుల కోసం రూ.8 లక్షలు వచ్చేలా ఇన్సూరెన్స్ అమలు చేస్తామన్నారు.

ఉప్పుతో ముప్పే..

- చిన్నారులు అతి తక్కువ మోతాదులో వాడాలి
- మార్కెట్లో దొరికే పలు కంపెనీల సాల్ట్ కంటే సాధారణ ఉప్పు మంచిది
- ప్రముఖ కిడ్నీ వైద్యుడు రాజేంద్ర



మాట్లాడుతున్న ప్రముఖ కిడ్నీ వైద్యుడు రాజేంద్ర

విజయవాడ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : ఆహార పదార్థాల్లో వాడాల్సిన దానికంటే ఎక్కువస్థాయిలో ఉప్పు వాడితే తీవ్ర అనారోగ్యాన్ని కొనితెచ్చుకున్నట్టేనని ప్రముఖ కిడ్నీ వైద్యుడు రాజేంద్ర అన్నారు. నగరంలోని ఐఎంఏ హాల్‌లో మంగళవారం చెన్నైకి చెందిన సేపియన్స్ హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆహారంలో ఉప్పు తగ్గింపుపై వర్క్‌షాపు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, రక్తపోటు పెరగడానికి ఉప్పు ప్రధాన కారణమన్నారు. ప్రపంచంలో భారత్ ఉప్పు ఎక్కువగా వాడితే, ఆంధ్రప్రదేశ్ ప్రజలు 30 శాతం అధికంగా ఉప్పు వాడుతున్నారని ఆయన తెలిపారు. సాధారణంగా రోజుకు 5 గ్రాముల ఉప్పు మాత్రమే వాడాలన్నారు. ముఖ్యంగా 12 నెలల చిన్నారులకు రోజుకు 1 గ్రాము, ఒకటి నుంచి 3 సంవత్సరాల చిన్నారులకు 2 గ్రాములు, 4-5 సంవత్సరాల పిల్లలకు 3 గ్రాములు, ఏడేళ్ల పైబడిన పిల్లలకు రోజుకు 5 గ్రాముల ఉప్పు మాత్రమే వాడాలన్నారు. ఉప్పు అధికంగా తీసుకోవడం వల్ల కిడ్నీలు పాడవడం, గుండె సంబంధిత సమస్యలు వచ్చే ప్రమాదం ఉందన్నారు. మార్కెట్లో దొరికే పలు రకాల సాల్ట్‌ల కన్నా సాధారణ ఉప్పు మేలని ఆయన అన్నారు. నగరానికి చెందిన కార్డియాలజీ వైద్యుడు కార్తీక్ మాట్లాడుతూ, రాష్ట్రంలో రాయలసీమ జిల్లాల ప్రజలు ఉప్పు ఎక్కువగా తినడం వల్ల బీపీ రోగులు ఎక్కువగా ఉన్నారన్నారు. ఉప్పు అధికంగా తీసుకుంటే మెదడుపై ప్రభావం చూపుతుందన్నారు. ఉప్పులో ఉండే సోడియం శరీరంలోని నీరు బయటకు పోకుండా చేసి ఉబకాయానికి దారి తీస్తుందన్నారు. అదే కోస్తాంధ్ర జిల్లాల ప్రజలు రైస్ తినడం వల్ల షుగర్ వచ్చి హార్ట్‌స్ట్రోక్‌కు గురవుతున్నారన్నారు. రుచి, మెరుగైన ఆరోగ్యం గురించి చెప్పే ఆరోగ్య నిపుణులు ఉప్పు వాడద్దనే సూచిస్తారన్నారు. కార్యక్రమంలో ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు నందగోపాల్, సెక్రటరీ బోస్, డాక్టర్ ఎర్విన్, సురేందరం తదితరులు పాల్గొన్నారు.

బందరు వాసినే..

- శ్మశానంలో అఘోరా సంచారం
- ఉలిక్కిపడిన ప్రజలు



మచిలీపట్నం టౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : బందరు శ్మశానంలో సోమవారం అర్ధరాత్రి అఘోరా సంచరించడంతో స్థానిక ప్రజలు ఉలిక్కిపడ్డారు. కాశీ నుంచి వచ్చిన అఘోరా స్మశానంలో భస్మం ఒంటికి రాసుకుని ఉండటంతో కాపరులు భయభ్రాంతులకు గురయ్యారు.శ్మశానంలో కాలభైరవ, కాళికా పూజలు చేసిన అఘోరా ఉదయాన్నే రేవతి సెంటర్‌లోని ఒక హోటల్‌లో కొంతసేపు సేదతీరాడు. మంగళవారం అఘోరాను 'ఆంధ్రజ్యోతి' పలుకరించగా ఆసక్తికర విషయాలు పంచుకున్నాడు.

"నేను బందరు వాసిని.. డిగ్రీ వరకు ఇక్కడే చదివా.. బాలభాను విద్యాలయంలో చదివే సమయంలోనే ఆధ్యాత్మిక చింతన అలవడింది. నోబుల్ కళాశాలలో డిగ్రీ పూర్తిచేసి ఆధ్యాత్మిక చింతనతో కాశీ వెళ్లి మణికర్ణిక ఘాట్‌లో కొంత కాలం ఉండి అనంతరం బందరు తిరిగి వచ్చా. బందరులోనే ఓ యువతిని వివాహం చేసుకున్నా. కొంతకాలం తర్వాత తల్లిదండ్రులు చనిపోవడంతో జీవితంపై విరక్తి చెందింది. ఆ సమయంలో భార్య విడాకులు ఇవ్వడంతో తిరిగి కాశీకి వెళ్లాను. అక్కడ గుజరాత్‌కు చెందిన ఆదేష్‌నాథ్ (అఘోరా గురువు) వద్ద దీక్ష తీసుకున్నా. అప్పటి నుంచి మణికర్ణిక ఘాట్‌లో ఉండిపోయాను. అఘోరాలకు కాశీలో గుర్తింపు కార్డులు ఇస్తారు. చాలా సంవత్సరాల తరువాత బందరు వచ్చాను. శ్మశానంలో రక్షణ మంత్రం చదువుతూ సంపుటీకరణ చేశా. ధర్మసంస్థాపనే అఘోరాల లక్ష్యం. శ్మశానంలో ఉగ్రసాధన చేస్తుంటాం. క్షుద్రపూజలు, చేతబడులు కాదు. శివుడ్ని రుద్రుడిగా భావిస్తాం. మహాకాలభైరవుడిని అర్చిస్తాం. కొన్ని శక్తులు వశం అయ్యే వరకు శ్మశానంలో పూజలు చేస్తాం. సమాజంలో బాధితులు, మనశ్శాంతి లేని వారిని ప్రతిఫలం ఆశించకుండా శాంతిమార్గంలో నడిపిస్తాం. పూర్వాశ్రమంలో నా పేరు అర్జా రవీంద్ర. గురువుగారు రవీంద్రనాథ్ పేరు పెట్టారు. బంధుత్వాలు, స్నేహాలకు దూరంగా ఉంటాం. ఈ కొత్త జీవితంలోనే పయనిస్తాం.." అని పేర్కొన్నాడు.

డ్రెయినేజీలో అవినీతి జలగలు

(5వ పేజీ తరువాయి)

ఎంతలా అంటే ఏకంగా పెనమలూరుకు చెందిన ఒక కాంట్రాక్టర్ చొక్కా విప్పి ధర్నాకు దిగుతానని ఉన్నతాధికారులకే సమాచారం అందిస్తే ఎం.బుక్‌కు నెంబరింగ్ యిచ్చారు. నందివాడ మండలానికి చెందిన మరో టీడీపీ అనుకూల కాంట్రాక్టర్ బిల్లులను అప్లోడ్ చేసుకోవడానికి ఎం.బుక్ కోసం సంప్రదించగా, బుక్ కనిపించడం లేదని ఆ ఇద్దరు చెప్పారని, ఈ విషయం ఆయన ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తే ఎం.బుక్ బయటపడింది. అప్పటికప్పుడే ఎం.బుక్‌ను పూర్తి చేసి ఇచ్చారని కార్యాలయవర్గాల సమాచారం. ఇటీవల గుడివాడ డ్రైనేజీ ఓ అండ్ ఎం వర్క్స్ ఎల్.వో.సీ.కి సంబంధించి రూ.8.59 కోట్ల బిల్లుల్లో గత వైసీపీ ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరించిన కాంట్రాక్టర్‌లకు పెద్ద పీట వేస్తూ, వారి బిల్లులను అప్లోడ్ చేశారు. అదే సమయంలో టీడీపీ అనుకూల సీఎస్ఆర్ ప్రాజెక్ట్‌కు చెందిన సుమారు రూ.45 లక్షల బిల్లులను అప్లోడ్ చేయకుండా ఇబ్బందులు పెట్టినట్టు సమాచారం.

ఏసీబీ దాడిలో ఉలికిపాటు

ఏసీబీ అధికారుల దాడితో డ్రైనేజీశాఖ ఈఈ కార్యాలయం ఒక్కసారిగా ఉలికిపాటుకు గురైంది. చల్లపల్లి ప్రాంతంలో రూ.36 లక్షలతో డ్రైనేజీ పనులను రేపల్లెకు చెందిన తురకా రాజా చేశారు. కోర్టు ఆదేశాలతో బిల్లు చెల్లింపు జరుగగా, తాను చేసిన డిపాజిట్ తాలుకు నగదును తీసుకునేందుకు ఎం.బుక్ అవసరముండటంతో డ్రైనేజీశాఖ జూనియర్ అసిస్టెంట్ గరికిపాటి శ్రీనివాసరావును సంప్రదించారు. ఒక శాతం నగదు చెల్లిస్తే అవసరమైన ఎం.బుక్ ఇస్తానంటూ బేరం పెట్టారు. విసిగిపోయిన కాంట్రాక్టర్ రాజా అవినీతి నిరోధక శాఖ అధికారులను సంప్రదించారు. సోమవారం లంచం తీసుకుంటున్న శ్రీనివాసరావును ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. మరో ఉద్యోగి తృటిలో తప్పించుకున్నాడని సమాచారం. అవినీతి వ్యవహారంలో వీరిద్దరికి ఒక ఉన్నతాధికారి అండదండలు పుష్కలంగా ఉన్నట్లు కార్యాలయ వర్గాలు చెప్పుకుంటున్నాయి. లంచంగా వచ్చిన నగదులో సదరు ఉన్నతాధికారికి కూడా వాటలున్నట్లు వినికిడి.

ఎరువు.. బరువు

(5వ పేజీ తరువాయి)

కాంప్లెక్స్ ఎరువుల ధరలతో రైతులు బెంబేలెత్తుతున్నారు. ధరలు ఏకంగా బస్తాకు రూ.100 నుంచి రూ.250 మేర పెరగడం రైతులకు భారంగా మారింది. మూడు దశాబ్దాల క్రితం ఎకరా పంట సాగుకు, కౌలుకు, కూలీలకు, ఎరువులకు, ఇతర పురుగుల మందుల వాడకానికి అయిన ఖర్చులతో పోలిస్తే ఇప్పుడయ్యే ఖర్చు ఐదు రెట్లు పెరిగింది. అప్పట్లో రూ.250 (50 కిలోల బస్తా) ఉన్న డీఏపీ బస్తా ఇప్పుడు రూ.1,350 ఉంది. అప్పట్లో కాంప్లెక్స్ ఎరువులు రూ.250 ఉండేవి. ఇప్పుడు ఏకంగా రూ.1,500 దాటి పోయాయి. పంటలకు నానో ఎరువులు వాడాలని ప్రభుత్వం చెబుతున్నా.. సేంద్రియ వ్యవసాయంపై దృష్టిసారించి కాంప్లెక్స్ ఎరువుల వినియోగం తగ్గించాలని వ్యవసాయశాఖ అధికారులు అవగాహన కల్పిస్తున్నా.. రైతులు మాత్రం కాంప్లెక్స్ ఎరువులనే వాడుతున్నారు. ఈ పరిణామం కూడా ఎరువుల ధరల పెరుగుదలకు కారణమవుతోంది.

సబ్సిడీలు తగ్గడం వల్లే..

ఏటా కేంద్ర ప్రభుత్వం ఎరువుల తయారీ కంపెనీలకు ఇచ్చే రాయితీని తగ్గిస్తూ రావడం వల్లే ధరలు పెరుగుతున్నాయి. ప్రభుత్వ సబ్సిడీ లభించకపోవడంతో కంపెనీలు ఎరువుల ధరలను అమాంతం పెంచేస్తున్నాయి. ఈ క్రమంలో మూడేళ్లుగా ధరలు పెరుగుతూ వస్తున్నాయి. అంతేకాకుండా దేశీయంగా లభించని కాంప్లెక్స్ ఎరువులైన పొటాష్, ఫాస్పరస్ వంటివి ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. వీటి ధరలు భారీగా పెరగడం వల్ల ఆ ప్రభావం అన్ని ఎరువులపై పడుతోంది. అయితే, యూరియాకు మాత్రమే 83.5 శాతం కేంద్రం రాయితీ ఇవ్వడంతో దాని ధరలు పెరగలేదు.

మూడేళ్లలో కాంప్లెక్స్ ఎరువుల ధరల పెరుగుదల (50 కిలోల బస్తా రూ.ల్లో)

ఎరువుల రకాలు	2023	2024	2025	పెరుగుదల (గత ఏడాది కంటే)
ఎంవోపీ	1,400	1,550	1,800	250
10-26-26	1,375	1,720	1,850	130
16-16-16	1,250	1,475	1,600	125
14-35-14	1,450	1,800	1,900	100
20-20-0-13	1,175	1,300	1,400	100

అదనపు ధరలకు అమ్మితే చర్యలు

పెరిగిన ఎరువుల ధరలు రైతులకు భారమయ్యాయి. ఈ క్రమంలో ఏ డీలర్ అయినా ఎరువుల కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు అమ్మినట్లు ఫిర్యాదులు వస్తే తప్పక చర్యలు ఉంటాయి. రైతులకు ఎక్కడా ఇబ్బంది లేకుండా చూస్తున్నాం.

- రజని, ఏవో, ఇబ్రహీంపట్నం

చర్యలకు సిద్ధం!

(5వ పేజీ తరువాయి)

ప్రభుత్వం సమకూర్చిన వాహనాలను తీసివేయలేదని, వాహన డ్రైవర్‌ను వేరే పనులకు వినియోగించుకుని లక్షల రూపాయల జీతం చెల్లించడాన్ని గుర్తించారు. ఆస్పత్రి ప్రాంగణంలో అపరిశుభ్రత ఉన్నట్లు గమనించారు. రోగులకు అందించే భోజనం విషయంలో నాణ్యతాలోపం ఉందని, మెనూ ప్రకారం ఏ రోజు భోజనం పెట్టిన దాఖలాలు లేవని నిర్ధారించారు. ముఖ్యంగా రోగులకు గుడ్లు సరఫరాలో చేతివాటం చూపించారని, రోగులకు ఇచ్చే మందుల సరఫరా, స్టాక్ రిజిస్టర్‌లో వ్యత్యాసాలు, ప్రతి రోజు రోగుల మంచాలపై దుప్పట్లు మార్చకపోవడం వంటి విషయాలను నివేదికలో పొందుపరిచారు.

మంత్రి ఆదేశించినా చర్యల్లేవ్!

రెండు నెలల క్రితం ఆస్పత్రిని పరిశీలించిన రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ సూపరింటెండెంట్ ఇందిరాదేవి వివాదాస్పద వ్యవహారశైలిపై క్రమశిక్షణ చర్యలకు ఆదేశించారు. అయినా ఇంత వరకు ఎటువంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. వైసీపీ ప్రభుత్వం నుంచి నేటి వరకు ఆమె సూపరింటెండెంట్‌గా కొనసాగుతుండటం గమనార్హం.

వంశీ అనుచరులకు
ముందస్తు బెయిల్

విజయవాడ సిటీ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అనుచరులు ఓలుపల్లి మోహనరంగారావు, అనగాని రవికి కోర్టులో ఊరట లభించింది. వారిపై నమోదైన కేసుల్లో ముందస్తు బెయిల్ మంజూరైంది. గన్నవరం గాంధీ బొమ్మ సెంటర్‌లోని సుంకర సీతామహాలక్ష్మి స్థలం కబ్జా చేశారనే అభియోగంపై నమోదైన కేసులో మోహనరంగారావు, రవి ఏ2, ఏ3గా ఉన్నారు. ఈ కేసులో పోలీసులు అరెస్టు చేయకుండా ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కొద్దిరోజుల క్రితం వారు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వాదనలు ముగియడంతో విజయవాడ 12వ ఏడీజే కోర్టు న్యాయాధికారి ఎం.సునీల్‌కుమార్ మంగళవారం ముందస్తు బెయిల్ మంజూరు చేస్తూ తీర్పును ఇచ్చారు. అదేవిధంగా 9.02 ఎకరాల భూమిని కబ్జా చేశారని ఆత్కూరు పోలీస్ స్టేషన్‌లో అనగాని రవిపై నమోదైన కేసులోనూ అతనికి ముందస్తు బెయిల్ మంజూరైంది.

ఘాట్‌రోడ్డులో కొండకు ఐరన్ మెష్
పనులు వేగవంతం



ఇంద్రకీలాద్రి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వర దేవస్థానం ఘాట్ రోడ్డులో భక్తుల భద్రత నిమిత్తం అధికారులు చేపట్టిన కొండకు ఐరన్ మెష్ ఏర్పాటు పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. వర్షాలకు కొండ ప్రాంతం తడిసి బండరాళ్లు జారి ఘాట్ రోడ్డులో పడకుండా ఉండేందుకు భక్తుల భద్రతలో భాగంగా అధికారులు కొండకు ఐరన్ మెష్ ఏర్పాటు పనులు గత కొన్ని నెలల నుంచి ప్రారంభించారు. ఘాట్ రోడ్డు రెండవ మలుపు నుంచి చైనావాల్ వరకు సుమారు 120 మీటర్ల పొడవు, 100 అడుగుల ఎత్తు వరకు కొండ రాళ్లు జారిపడకుండా ఉండేందుకు దేవస్థానం ఇంజనీరింగ్ అధికారులు సుమారు రూ.2కోట్లతో ఐరన్ మెస్ ఏర్పాటు పనులు చేపట్టారు. ఈ పనులను దసరా ఉత్సవాల లోపే పూర్తి చేయాలనే ప్రయత్నంలో ఇంజనీరింగ్ అధికారులు ఉన్నారు. కాగా, ఘాట్ రోడ్డు మొదటి మలుపు వద్ద కొండకు సుమారు 15 ఏళ్ల క్రితం ఐరన్ మెష్ ఏర్పాటు చేశారు. భారీగా కురిసిన వర్షాలకు కొండరాళ్లు జారి ఐరన్ మెష్‌లోనే కొన్ని రాళ్లు నిలిచిపోయాయి. ఎక్కువ సంవత్సరాలు కావటం వలన ఆ కొండ ప్రాంతంలో కూడా మళ్లీ ఐరన్ మెష్ ఏర్పాటు చేస్తే భక్తులకు మరింత భద్రత ఏర్పడుతుంది. ఆ దిశగా సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు చర్యలు చేపడుతున్నారు.

కొండకు ఐరన్ మెష్ ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	105, 113, 124
చికెన్ విత్ స్కిన్	200
చికెన్ స్కిన్‌లెస్	210

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 475

సూపర్‌సిక్స్ పథకాల అమలే కూటమి ధ్యేయం: వైవీబీ

ఉయ్యూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): సూపర్‌సిక్స్ పథకాలు ఒక్కొక్కటి అమలు చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజల మన్ననలను పొందుతున్నాడని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ అన్నారు. ఉయ్యూరు 15వ వార్డు ఎస్టీ కాలనీలో మంగళవారం పర్యటించి సుపరిపాలనలో తొలి అడుగు ఉద్దేశాన్ని తెలియజేశారు. పార్టీ నాయకులు జంపని వీరశ్రీనివాసరావు, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



చెత్త నుంచి సంపద తయారీపై అవగాహన



పునాదిపాడులో అవగాహన కల్పిస్తున్న డీపీవో అరుణ, సర్పంచ్ విజయకుమారి

కంకిపాడు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : చెత్త నుంచి సంపద ఏ విధంగా ఏర్పచుకో వాల్లో అన్నదానిపై పంచాయతీ అధికారులు, సిబ్బందికి అవగాహన అసర ముందని జిల్లా పంచాయతీ అధికారి అరుణ అన్నారు. కంకిపాడు మండలంలోని పునాదిపాడులో ఘన వ్యర్థాల నిర్వహణ, సంపద అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డీపీవో అరుణ మా ట్లాడుతూ, గ్రామాలను పరిశుభ్ర గ్రామాలుగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మునిబోయిన విజయకుమారి, ఎంపీడీవో అనూష్, బసవయ్య, స్వరూప్ పాల్గొన్నారు.

మానవత విద్యానిధికి రూ.20 లక్షల విరాళం

హనుమాన్‌జంక్షన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : మానవత ఉమ్మడి కృష్ణాజిల్లా విద్యానిధికి మానవత జంక్షన్ శాఖ నుంచి రూ.20 లక్షల విరాళం అందించనున్నట్లు విద్యానిధి చైర్మన్ మారుబోయిన కోటేశ్వరరావు మంగళవారం ప్రకటనలో తెలిపారు. సోమవారం గుడివాడలో నిర్వహించిన సమావేశంలో రూ.50లక్షలతో విద్యానిధిని ఏర్పాటు చేయాలని సంకల్పించారని అందులో జంక్షన్ శాఖ నుంచి రూ. 20 లక్షలు ప్రకటించినట్లు కోటేశ్వరరావు పేర్కొన్నారు.

14 వరకు పంట బీమా గడువు పెంపు

కంకిపాడు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : రైతులు తమ పంటలకు పంట బీమా చేయించుకోవాలని వ్యవసాయ సహాయ సంచాలకులు స్వర్ణలత అన్నారు. మండలంలోని మద్దూరులో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వర్ణలత మాట్లాడుతూ, ఈ నెల 14వ తేదీ వరకు పంట బీమా గడువు పొడిగించటం జరిగిందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరుచుకోవాలని సూచించారు. అదే విధంగా రైతులు అందరూ పంట నమోదు చేయించుకోవాలని కోరారు. రైతులు సేంద్రియ వ్యవసాయంపై దృష్టి పెట్టాలన్నారు. ఏవో ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

మునిసిపాలిటిలో చెత్త సేకరణకు ప్రాధాన్యం

ఎమ్మెల్యే బోడె ప్రసాద్



మునిసిపల్ అధికారులకు జేసీబీని అప్పగిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : తాడిగడప మునిసిపాలిటీలో చెత్తసేకరణ ప్రక్రియకు ప్రాధాన్యత పెంచుతామని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. మంగళవారం మునిసిపాలిటీలో చెత్త నిర్వహణకు కొనుగోలు చేసిన అత్యాధునిక జేసీబీని మునిసిపల్ అధికారులకు అప్పగించే కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. నెల క్రితం గార్బేజీని మునిసిపాలిటీ నుంచి గుంటూరు జిందాల్ యార్డుకు తరలించేందుకు ఒక్కొక్కటి 30టన్నుల సామర్థ్యం ఉన్న రెండు వాహనాలను కొనుగోలు చేసి మునిసిపాలిటీకి అప్పగించామని తెలిపారు. రోడ్ల వెంబడి పేరుకుపోయిన గార్బేజి, డ్రెయిన్ల ప్రక్కల ఉండే మెరకలు తొలిగించేందుకు ఈరోజు జేసీబీని అందిస్తున్నామని తెలిపారు. మునిసిపల్ పరిధిలో చెత్త సేకరణ, శానిటేషన్ ఇంకా మెరుగుపడాల్సి ఉందని, ఇంటింటికీ తిరిగి చెత్త సేకరించేందుకు చెత్త సేకరణ వాహనాలను పెంచామని, 65మంది అదనపు సిబ్బందిని కూడా విధుల్లోకి తీసుకుంటున్నామని తెలిపారు. చెత్తసేకరణ, శానిటేషన్‌లో మునిసిల్ సిబ్బంది, అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ● పోరంకి నారాయణపురం కాలనీలో 15.25లక్షల సాధారణ నిధులతో నిర్మించ తలపెట్టిన మెట్లకు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మంగళవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో తాతపూడి గణేష్, యేకుల విజయేంద్ర, కంచర్ల పూర్ణ, కంచర్ల సుకన్య, వినుకొండ రాజా తదితరులు పాల్గొన్నారు.




తోపుడు బళ్లు అందజేస్తున్న బోడె వెంకట్రామ్, తదితరులు

పేద మహిళలకు తోపుడు బళ్లు అందజేత

పెనమలూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : కంకిపాడు మండలం నెప్పల్లికి చెందిన చిట్టిపోతుల రావమ్మ, వణుకూరుకు చెందిన షైనేని రాణి అనే నిరుపేద మహిళలకు యువ నేత బోడె వెంకట్రామ్ మంగళవారం తోపుడు బళ్లు అందజేశారు. ● యనమలకుదురులో జరిగిన తోపుడు బళ్ల అందజేత కార్యక్రమం సుజాత ట్రేడర్సు లంకా వెంకటసుబ్బారావు ఆర్థికసాయంతో టీడీపీ నాయకులు మొక్కపాటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగింది. లంకా నారాయణ కుటుంబ సభ్యులు లంకా సురేష్, కొండ, వీరాస్వామి, నాగరాజు పాల్గొన్నారు.

ఉయ్యూరు జడ్పీటీసీ ఎన్నిక జరిపించాలి

ఉయ్యూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : మూడేళ్లుగా ఖాళీగా ఉన్న మండల జడ్పీటీసీ స్థానానికి ఎన్నిక జరపాలని కోరుతూ రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు లేఖ రాసినట్టు ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని వెంకటేశ్వరరావు తెలిపారు. గత ఎన్నికల్లో వైసీపీ నుంచి జడ్పీటీసీగా ఎన్నికైన యలమంచిలి పూర్ణిమ తన పదవికి రాజీనామా చేయగా అప్పటి నుంచి మండలానికి జిల్లా పరిషత్ నిధులు రావడం లేదన్నారు.



ఉరేసుకుని యువకుడు మృతి

కంకిపాడు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రేమ వ్యవహారంలో ఓ యువకుడు మృతి చెందిన ఘటన కంకిపాడులోని రెల్లి కాలనీలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కంకిపాడు రెల్లి కాలనీకి చెందిన వడ్డాది లక్ష్మీ నారాయణ(22) ప్రేమ వ్యవహారంపై ఇంట్లో పెద్దల తో గొడవ జరుగుతోంది. 4వ తేదీ రాత్రి ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని ఉయ్యూరు ప్రభుత్వ ఆసుపత్రికి తర లించారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని రిక్షా కార్మికుడు..

కంకిపాడు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్సు ఢీ కొని రిక్షా కార్మికుడు మృతి చెందిన ఘటన కంకిపాడులో మంగళవారం ఉదయం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కంకిపాడు పులిరామారావు నగర్‌కు చెందిన బొల్లా కృష్ణ (60) రిక్షా తొక్కుతూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం ఉదయం బస్టాండులో మూత్ర విసర్జనకు వెళ్లి వస్తున్నాడు. అదే సమయంలో బస్టాండులో ఉన్న ఆర్టీసీ బస్సు రివర్స్ చేస్తుండగా బస్సు కింద కృష్ణ పడిపోయాడు. 108 సిబ్బంది కృష్ణ మృతి చెందినట్లు ధ్రువీకరించారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్సై డి. సందీప్ తెలిపారు.

వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం

హనుమాన్‌జంక్షన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : మెదడుకు సంబంధించిన వ్యాధితో బాధపడుతున్న బాపులపాడు గ్రామానికి చెందిన చింగలూరి హేమలత వైద్య ఖర్చులకు కమ్మవారి ఐక్య సేవాసమితి వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రామకృష్ణ మంగళవారం రూ.30,336లు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో సమితి నిర్వాహ కులు అట్లూరి రాజశేఖర్, పొట్లూరి సత్యఫణీంద్రకుమార్, వీరమాచనేని రవికుమార్ పాల్గొన్నారు.

టీడీపీ నేత యనమదలకు పరామర్శ

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : తీవ్ర అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లోని బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రిలో చికిత్స పొంది మల్లవల్లి వచ్చిన టీడీపీ నేతను యనమదల వెంకయ్యారావును మంగళవారం పలువురు నాయకులు పరామర్శించారు. ఆళ్ల గోపాలకృష్ణ, గుండపనేని ఉమావర ప్రసాద్, మండాది రవీంద్ర, అమృతపల్లి సూర్యనారాయణ, అక్కినేని ధర్మరాజు, కృష్ణాజీ, నాగరాజు పరామర్శించిన వారిలో ఉన్నారు.

ఆరోగ్య అవగాహన ప్రదర్శనకు విశేష స్పందన



గన్నవరం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల, డాక్టర్స్ సుధా అండ్ నాగేశ్వరరావు సిద్ధార్థ దంత వైద్య కళాశాలలో జరుగుతున్న ఆరోగ్య అవగాహన ప్రదర్శనకు విశేష స్పందన లభించింది. మంగళవారం సుమారు 2వేల మంది విద్యార్థులు కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాల నుంచి వచ్చి ఎగ్జిబిషన్‌ను తిలకించారు. ఈఎన్‌టి హెచ్‌వోడీ డాక్టర్ సతీష్‌చంద్ర ముక్కు దిబ్బడ, తలనొప్పి, సైనసైనటిస్ గురించి వివరిం చారు. డీజీ డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు మాట్లాడుతూ, విద్యార్థులకు వైద్యం, వైద్య పరికరాలపై అవగాహన కల్పించేందుకే ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దంత వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ రామోజీరావు మాట్లాడుతూ, దంత సమస్యల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ భీమేశ్వర్, హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

బోడె ప్రసాద్‌ని విమర్శించే స్థాయి లేదు

వైసీపీ నేత చక్రవర్తి వ్యాఖ్యలపై టీడీపీ నేతల మండిపాటు

పెనమలూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ ఏడాదిలోనే అభివృద్ధి పనులకు వంద కోట్ల నిధులు తెచ్చి ఖర్చుపెట్టటంతో పాటు సూపర్ సిక్స్ హామీలు నెరవేరుస్తున్న తమ నాయకుడు బోడె ప్రసాద్‌ను విమర్శించే స్థాయి వైసీపీ ఇన్‌చార్జి దేవభక్తుని చక్రవర్తికి లేదని టీడీపీ నేతలు మండిపడ్డారు. మంగళవారం పోరంకి టీడీపీ కార్యాలయంలో పార్టీ నేతలు సమావేశం నిర్వహించారు. సోమవారం దేవభక్తుని చక్రవర్తి, ఎమ్మెల్యే బోడె ప్రసాద్, టీడీపీ కూటమి ప్రభుత్వంపై చేసిన కువిమర్శలను తిప్పికొట్టారు. ఉచిత ఇసుక ఇస్తూ రవాణా, లోడింగ్ చార్జీలు మాత్రమే వసూలు చేస్తున్న టీడీపీ కూటమి ప్రభుత్వానికి, ఒక లోడు ఇసుక లక్ష రూపాయలకు అమ్ముకున్న వైసీపీకీ ఎంత తేడా ఉందో ప్రజలు గమనిస్తున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇసుక, మద్యం ద్వారా దోచుకొన్న వైసీపీ నాయకులను చూసే ప్రజలు 11సీట్లకు పరిమితం చేశారన్నారు. సమావేశంలో కోయ ఆనంద్‌ప్రసాద్, యార్లగడ్డ సుచిత్ర, కొండా ప్రవీణ్, పీతా గోపీచంద్, శొంఠి శివరాంప్రసాద్, మండవ జయదేవ్, సంగెపు రంగారావు, వాణి, బొంగరాల అబ్రహాం, బొప్పన నీరజ, నీరుకొండ శేషుకుమారి, మేడసాని రత్నకుమారి, పండుల రజిని, రేపాకుల నాగలక్ష్మి, మల్లంపాటి విజయలక్ష్మి, పొనుగుబాటి జయరాజు, దోనేపూడి రమాదేవి పాల్గొన్నారు.



సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై పెనుభారం



ఉయ్యూరులో ప్రజా సంఘాల నిరసన

గన్నవరం/ విజయవాడ రూరల్ / హనుమాన్‌జంక్షన్ / ఉంగుటూరు / ఉయ్యూరు / కంకిపాడు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై మోపుతున్న విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా అందరూ ముందుకు రావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కళ్లం వెంక టేశ్వరరావు అన్నారు. స్మార్ట్ మీటర్ల విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ గన్నవరం పట్టణంలో సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ మంగళవారం జరిగింది. ● విద్యుత్ స్మార్ట్ మీటర్లు ప్రజలపై ఆర్థిక భారాన్ని మోపుతాయని సీపీఎం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి డివి. కృష్ణ అన్నారు. విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపు ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని కోరుతూ నున్నలోని విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద సీపీఎం నేతలు మంగళవారం ధర్నా నిర్వహించారు. ●విద్యుత్ వినియోగదారులపై వేసిన ట్రూఅప్ చార్జీల భారాన్ని తగ్గించాలని కోరుతూ సీఐటీయూ బాపులపాడు మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. ● విద్యుత్ భారాలను ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో తీవ్రపరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు టీవీ లక్ష్మణస్వామి, అజ్మీర వెంకటేశ్వరరావు హెచ్చరించారు. ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో మంగళవారం ఉంగుటూరు వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ● కూటమి ప్రభు త్వం ప్రజలను మోసం చేసిందని కౌలురైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు ఆరోపించారు. విద్యుత్ చార్జీల భారం తగ్గించి, స్మార్ట్ మీటర్ల పేరిట దోపిడీని ఆపాలని, ట్రూఅప్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ఉయ్యూరు సెంటర్‌లో ప్రదర్శన నిర్వహించారు.● విద్యుత్ చార్జీలు తగ్గించాలని, స్మార్ట్ మీటర్స్ తొలగించాలని ప్రజా ఐక్యవేదిక నాయకులు పంచకర్ల రంగారావు అన్నారు. కంకిపాడు బస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సంతకాల సేకరణలో ఆయన పాల్గొన్నారు.



ఘనంగా వేంకటేశ్వరస్వామి వ్రతం

హనుమాన్‌జంక్షన్,ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : స్థానిక శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో మంగళవారం సామూహిక వేంకటేశ్వరస్వామివ్రతం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు చక్రావధానుల సీతారామాచార్యులు పర్యవేక్షణలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని భక్తిశ్రద్ధలతో ఆచరించారు. వ్రతంలో పాల్గొన్న భక్తులకు ఆలయ ట్రస్టీ కాకాని వెంకటేశ్వరరావు, అరుణ దంపతులు ఉచితంగా పూజా సామగ్రి అందజేశారు.

షటిల్ పోటీలు రేపు

గన్నవరం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : క్రీడాపితామహుడు ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా 7న జిల్లాస్థాయి షటిల్ బాడ్మింటన్ పోటీలను గన్నవరం కేవీఆర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు కృష్ణా జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారిణి ఝాన్సీలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న 19 సంవత్సరాలలోపు వయస్సు కలిగిన బాల, బాలికలు ఆధార్ కార్డు, పదవ తరగతి సర్టిఫికెట్‌తో హాజరు కావాలని ఆమె కోరారు. వివరాలకు ముందుగా ఎంట్రీలు నమోదుకు కిషోర్ ఫోన్ నంబర్ 98850-68099లో సంప్రదించాలని కోరారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

ఉంగుటూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : 33/11కేవీ ఉంగుటూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని లంకపల్లి ఫీడర్ లైన్ల మరమ్మతుల నిమిత్తం బుధవారం ఉదయం 7.30గం.లనుంచి మధ్యాహ్నం 12.30గం.ల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు గుడివాడ విద్యుత్‌శాఖ ఈఈ జీబీ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. పొణుకుమాడు, గారపాడు, ఆముదాలపల్లి, కొయ్యగూరపాడు, లంకపల్లి, ఓంద్రంపాడు, ముక్కపాడు, ఎలుకపాడు తదితర గ్రామాల్లో సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.









గ్రీన్ ఎనర్జీ ప్లాంటు ఏర్పాటుపై మంత్రి కొల్లు రవీంద్రతో చర్చిస్తున్న పోలెండ్ దేశానికి చెందిన పెట్టుబడిదారులు

గ్రీన్ ఎనర్జీ ప్లాంట్ ఏర్పాటుకు కృషి

● జేకేఎస్ఎస్ సంస్థ ప్రతినిధులతో మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మచిలీపట్నంలో గ్రీన్ ఎనర్జీ ప్లాంటు ఏర్పాటు చేస్తున్నామని, దీంతో బందరును ఉపాధి కేంద్రంగా మార్చేందుకు అవకాశాలు ఏర్పడతాయని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మంగళవారం మచిలీపట్నంలోని తన క్యాంపు కార్యాలయంలో గ్రీన్ ఎనర్జీ ప్లాంట్ ఏర్పాటుపై జేకేఎస్ఎస్ సంస్థ ప్రతినిధులు, పోలెండ్ దేశానికి చెందిన పెట్టుబడిదారులతో సమావేశమయ్యారు. పోర్టు సమీపంలో గ్రీన్ ఎనర్జీ ప్లాంట్ ఏర్పాటుకున్న అవకాశాలను సంస్థ ప్రతినిధులకు మంత్రి వివరించారు. జేకేఎస్ఎస్ సంస్థ ఛైర్మన్, సీఈవో శ్రీ వాస్తవతో మంత్రి కొల్లు రవీంద్ర ప్లాంట్ ఏర్పాటుపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి రవీంద్ర మీడియాతో మాట్లాడుతూ పోర్టు పనులను త్వరగా పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. పోర్టు సమీపంలో గ్రీన్ ఎనర్జీ ప్లాంటుకు అనుకూలత ఉందన్నారు. ప్లాంట్ నిర్మాణానికి రవాణా అత్యంత సులభమన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న ధనేకుల రవీంద్రనాథ్ ఠాగూర్

ఘనంగా ధనేకుల 86వ జన్మదిన వేడుకలు

పెనమలూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): గంగూరు ధనేకుల ఇంజనీరింగ్ కళాశాల ఛైర్మన్, ప్రముఖ పారిశ్రామికవేత్త ధనేకుల రవీంద్రనాథ్ ఠాగూర్ 86వ జన్మదిన వేడుకలను కళాశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు ప్రముఖులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గెట్ టు గెదర్‌లో పలువురు వక్తలు మాట్లాడుతూ అనేక విధాలుగా సమాజాభివృద్ధిలో పాలుపంచుకొంటున్న ఠాగూర్ జీవితం స్ఫూర్తిదాయకమన్నారు. కళాశాలకు చెందిన సుమారు వందమంది స్టాఫ్‌కు టాప్‌స్టార్ ఆసుపత్రి వైద్య బృందంతో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. కళాశాలకు చెందిన కొరిటాల వసంతకు ఎంటెక్ చదువుకు రూ.10వేలను ఠాగూర్ అందించారు. వైద్యులు డాక్టర్ దినేష్ దావులూరు, డాక్టర్ చిగురుపాటి హాసిత, డాక్టర్ సాయి హర్షిత, డాక్టర్ ఉండి రాకేష్, ప్రిన్సిపాల్ రవి కడియాల, డైరెక్టర్ రవి ప్రసాద్, సెక్రటరీ కరస్పాండెంట్ ధనేకుల భవానీప్రసాద్, లయన్ రావి సురేష్, హెచ్‌వోడీ హేమ పాల్గొన్నారు.

జయప్రద ఫౌండేషన్ సేవలు నిరుపమానం

జగ్గయ్యపేట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): జయప్రద ఫౌండేషన్ ద్వారా టీడీ జనార్ధన్ అందిస్తున్న సేవలు నిరుపమానమని కేడీసీసీ బ్యాంకు ఛైర్మన్ నెట్టెం రఘురాం, ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్ర అన్నారు. 3 రోజుల ఉచిత వైద్య శిబిరం ప్రారంభించిన అనంతరం వారు మాట్లాడుతూ జన్మభూమిపై మమకారంతో ఉచిత కంటి వైద్య శిబిరాలతో పాటు సాధారణ, దంత వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్న జనార్ధన్‌ను ప్రశంసించారు. ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ఉచిత వైద్యం అందించటం ఆనందంగా ఉందన్నారు. నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు కన్నెబోయిన రామలక్ష్మీ, ఎంజీఆర్ చారిటబుల్ ట్రస్టు ప్రతినిధి మాదాల శ్రీనివాస్, ఆపిరాన్ హెల్త్ కేర్ కేర్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ డాక్టర్ కంచర్ల శ్రీనివాస్, ఎండీ అనిత, డాక్టర్ కృష్ణప్రసాద్, డాక్టర్ పీ శ్రీనివాస్, కట్టా నరసింహారావు పాల్గొన్నారు.

ట్రాంపోలైన్ చాంపియన్‌షిప్‌కు

క్రీడాకారులు రాయ్‌పూర్ పయనం



క్రీడాకారులతో అసోసియేషన్ సభ్యులు

విజయవాడ స్పోర్ట్స్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 8 నుంచి 10 వరకు రాయ్‌పూర్‌లోని మహారాణ ప్రతాప్ స్పోర్ట్స్ కాలేజ్‌లో జరిగే ట్రాంపోలైన్ నేషనల్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనేందుకు ఆంధ్రప్రదేశ్ సీనియర్, జూనియర్, సబ్‌జూనియర్ జట్లు పయనమైనట్టు ఎన్టీఆర్ జిల్లా జిమ్నాస్టిక్స్ అసోసియేషన్ సెక్రటరీ బీ బాబూరావు తెలిపారు. సీనియర్ జట్టులో వీ నీలవేణి, ఎస్ ప్రజ్ఞ (వీఆర్ సిద్ధార్థ), ఎస్ ఐశ్వర్య (పీబీ సిద్ధార్థ), జూనియర్ జట్టులో ఎస్ కీర్తన (సిద్ధార్థ మహిళ కళాశాల), సబ్ జూనియర్స్ జట్టులో కే శ్రీ సరయు, ఎల్ శ్రీరాం (వీపీఎస్ పబ్లిక్ స్కూల్) చాంపియన్‌షిప్‌లో పాల్గొంటున్నారు. క్రీడాకారులను అసోసియేషన్ ఉపాధ్యక్షుడు వీ దుర్గాప్రసాద్, ఎల్ మురళి కృష్ణ, కే రఘురామ్, వై రామ్మోహన్ శుభాకాంక్షలు తెలిపారు.

నోషనల్ ఇంక్రిమెంట్ మంజూరు చేయాలి

● గ్రామ, వార్డు సచివాలయ శాఖ డైరెక్టర్‌కు వినతిపత్రం



డైరెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నేతలు

ఆటోనగర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు నోషనల్ ఇంక్రిమెంట్ మంజూరు చేయాలని కోరుతూ మంగళవారం ఆటోనగర్‌లోని గ్రామ, వార్డు సచివాలయాల శాఖ రాష్ట్ర కార్యాలయంలో శాఖ డైరెక్టర్ ఎం శివప్రసాద్‌కు ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్యవేదిక నేతలు వినతిపత్రం అందజేశారు. ఉద్యోగులకు డేట్ ఆఫ్ జాయినింగ్ నుంచి నోషనల్ ఇంక్రిమెంట్ మంజూరు చేయాలని, వినతి పత్రంలో పేర్కొన్నారు. డైరెక్టర్ సానుకూలంగా స్పందించారని, నోషనల్ ఇంక్రిమెంట్‌కు సంబంధించిన దస్త్రం వెంటనే ప్రభుత్వానికి పంపుతామని చెప్పినట్టు ఐక్యవేదిక నేతలు పేర్కొన్నారు. ఐక్యవేదిక రాష్ట్ర ఛైర్మన్ ఎండీ జానీపాషా, సెక్రటరీ జనరల్ విప్పర్తి నిఖిల్, కన్వీనర్ షేక్ అబ్దుల్ రజాక్, నేతలు షాలెం కృప, షణ్ముఖ, మహాలక్ష్మి, విష్ణు పాల్గొన్నారు.

విద్యార్థి సంఘాల నిర్వీర్యం దుర్మార్గం

● ఎస్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్

కృష్ణలంక, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి సంఘ నేత నుంచి సీఎంగా ఎదిగిన చంద్రబాబు విద్యార్థి సంఘాలను నిర్వీర్యం చేయాలనుకోవడం దుర్మార్గమని ఎస్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల శ్రీనివాస్ అన్నారు. ఆంధ్రరత్న భవన్‌లో మంగళవారం ఆయన మాట్లాడుతూ తన వారసత్వ రాజకీయ భవిష్యత్తుకు అడ్డం వస్తారని భావించిన చంద్రబాబు పదవి చేపట్టినప్పటి నుంచి నేటివరకు రాష్ట్రంలో ఎలాంటి విద్యార్థి సంఘ ఎన్నికలు జరుగకుండా అడ్డుకొంటున్నారని మండిపడ్డారు. విద్యార్థి సంఘాల నేతల ప్రవేశాన్ని నిషేధించి సంఘాలను అదుపు చేయాలనే దుర్మార్గపు జీవోలను ఇవ్వడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం జీవోను తక్షణమే రద్దు చేయాలని వేముల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఎస్ఎస్‌యూఐ నేతలు ఆకాష్, రవితేజ పాల్గొన్నారు.

తిరువూరుకు మినీ ట్యాంక్‌బండ్!

చారిత్రక 'దేవసముద్రం' చెరువు ఆధునికీకరణకు ప్రతిపాదనలు

మధిర మెయిన్ రోడ్డు పక్కనే పర్యాటకంగా అలరారుతున్న ప్రాంతం ● ప్రతిపాదనలకు రూపకల్పన చేస్తున్న ఎమ్మెల్యే



దేవసముద్రం చెరువు

ఆంధ్రజ్యోతి, తిరువూరు: మినీ ట్యాంక్ బండ్‌గా చారిత్రక నేపథ్యం కలిగిన 'దేవసముద్రం' ఆధునీకరణకు రంగం సిద్ధమైంది. పట్టణ ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం అందించేందుకు, మధిర ప్రధాన రోడ్డు పక్కనే ఉన్న దేవసముద్రం చెరువును ఆధునీకరించి, మినీ ట్యాంక్‌బండ్‌గా రూపొందించేందుకు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ప్రతిపాదనలు తయారు చేయిస్తున్నారు. ఈ చెరువుకెంతో చరిత్ర ఉంది. దీన్ని 13వ శతాబ్దంలో కాకతీయరాజు గణపతిదేవుడు నిర్మించతలపెట్టాడు. ఆయన చివరిదశలో రాణిగా బాధ్యతలు స్వీకరించిన రాణిరుద్రమదేవి పూర్తిచేసినట్టు ప్రచారంలో ఉంది. తొలుత దేవతల చెరువుగా పేరొందిన ఈ చెరువు కాలక్రమంలో దేవసముద్రంగా పిలవబడుతోంది. ప్రస్తుత రికార్డుల ప్రకారం, ఆర్ఎస్ నెం.81లో 12.10 ఎకరాలు, 84లో 18.25 ఎకరాలు, 164లో 44.44 ఎకరాలు, మొత్తం 77.79 ఎకరాల విస్తీర్ణం గల ఈ చెరువు పరిధిలో సుమారు 200 ఎకరాలకు పైగా ఆయకట్టు ఉంది. ఈ చెరువుకు ఎన్ఎస్పీ తిరువూరు మేజర్, రాకట్టు సప్లయి చానల్ కాల్వల నుంచి నీరు చేరుతుంది. వేసవిలోనూ ఈ చెరువులో కొంతమేర నీరుంటుంది. ప్రస్తుతం ఈ చెరువు కొంత ఆక్రమణకు గురికాగా, కొంతస్థలంలో చెత్తవేస్తుండటంతో డంపింగ్‌యార్డుగా మారుతోంది. నిత్యం ఆంధ్ర-తెలంగాణ ప్రాంతాలకు రాకపోకలతో ఈ ప్రధాన రహదారి రద్దీగా ఉంటుంది. పట్టణం ప్రారంభంలో ఉన్న దేవసముద్రం చెరువు వద్ద చెత్తఇతర వ్యర్థాలు వేస్తుండటంతో, ఈ ప్రాంతం దుర్వాసనతో, అపరిశుభ్రంగా తయారవుతోంది. ప్రస్తుతం ఈ చెరువు చుట్టూ కట్టలు పూర్తిస్థాయిలో నిర్మించడంతో పాటు కట్టకు ఇరువైపుల చెట్లు, వివిధ రకాల పూలమొక్కలతో నందనవనంగా మార్చడం, పట్టణంలో ఎక్కడా సరైన పార్కు లేకపోవడంతో, చెరువుకట్టపై ఉదయం సాయంత్రం నడక వ్యాయామానికి అనువుగా ట్రాక్ ఏర్పాటు, ఈ రహదారిపై రాకపోకలు సాగించే వారు, సీనియర్ సిటిజన్లు, ఇతరులు సేద తీరేందుకు, చెరువు ఆధునీకరణతో పాటు, కొంతభాగం అన్ని వసతులతో పార్కు ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ఇటీవల మధిర రోడ్డులో పీటీ కొత్తూరు వద్ద జవహర్ నయోదయ స్కూల్ ఏర్పాటుకు కేటాయించిన స్థలాన్ని జిల్లా అధికారులకు చూపించడం, పట్టణ పరిధిలోని ఏడు చెరువులకు సాగునీరందించే రాకట్టు సప్లయి చానల్ (కట్టుకాల్వ), ఎన్ఎస్పీ కాల్వల పూడికతీత పనులతో, మెట్టప్రాంతమైన తిరువూరుకు, సాగునీటి ఎద్దడిని తగ్గించడంతో పాటుగా, దేవసముద్రం చెరువును ఆధునీకరించి మినీ ట్యాంక్‌బండ్‌గా రూపొందించేందుకు ఎమ్మెల్యే చేస్తున్న ప్రతిపాదనలపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఎన్ఎస్పీ నుంచి చెరువుకు నీరు అందించే సప్లయి చానల్

చివరి ఎకరాకూ సాగునీరు

● మంత్రి రామానాయుడు



గుడ్లవల్లేరు లాకుల వద్ద నీటి రీడింగ్‌ను పరిశీలిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు, పెడనలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి

గుడ్లవల్లేరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కృష్ణా డెల్టాలో చివరి ఎకరా వరకూ సాగునీటిని అందించి ఆదుకొనేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో పనిచేస్తోందని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. మంగళవారం సాయంత్రం గుడ్లవల్లేరు మండలంలో సాగునీటి, డ్రెయినేజీల పనితీరును, లాకుల వద్ద దిగువకు పంపిణీ అవుతున్న సాగునీటి రీడింగ్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. పట్టిసీమ నుంచి 10.7 టీఎంసీల నీటిని గోదావరి నుంచి కృష్ణకు తెచ్చి సాగునీటి ఎద్దడిని అధిగమించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రకాశం బ్యారేజి వద్ద తూర్పు కృష్ణకు 10,400 క్యూసెక్కులు నీటిని తీసుకొని రెవెస్ కెనాల్‌కు 5వే క్యూసెక్కులు, బందరు కాల్వకు 1900 క్యూసెక్కులు, కేఈబీకి 1800 క్యూసెక్కులు, ఏలూరు కాల్వకు 1500 క్యూసెక్కులు నీటిని ఇస్తున్నామన్నారు. ఈ ఏడాది వర్షాలు తక్కువగా ఉండటంతో పెడన నియోజకవర్గంలోని కొన్ని ప్రాంతాల్లో ఇబ్బంది నెలకొందన్నారు. ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ తన దృష్టికి తీసుకు రాగా తానే స్వయంగా పరిస్థితి చూసేందుకు వచ్చానన్నారు. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు, నీటిసంఘం ప్రజాప్రనిధులు ముగ్గురూ సమన్వయంతో పనిచేస్తే సమస్య ఉండదన్నారు. గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, రాష్ట్ర వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ రావి వెంకటేశ్వరరావు, గుడ్లవల్లేరు డీసీ ఛైర్మన్ పాలేటి ఆంజనేయులు, కొత్తవరం డీసీ ఛైర్మన్ మల్లిపెద్ది సుబ్రహ్మణ్యేశ్వర చౌదరి, చలపాటి ప్రసాద్, గుడివాడ,గుడ్లవల్లేరు ఏఎంసీ ఛైర్మన్లు చాట్రగడ్డ రవికుమార్, పొట్లూరి రవికుమార్, టీడీపీ రాష్ట్ర సెక్రటరీ సాయిన పుష్పావతి, కొడాలి రామరాజు, ఇరిగేషన్ అధికారులు, నీటిసంఘాల అధ్యక్షులు, టీడీపీ, జనసేన నేతలు పాల్గొన్నారు.

ఇరిగేషన్ సిబ్బందిపై మంత్రి ఆగ్రహం

బంటుమిల్లి లాకుల వద్ద చెత్తాచెదారం పేరుకుపోయి ఉండటాన్ని మంత్రి రామానాయుడు గమనించి వెంటనే లాక్ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, ఏఈ లక్ష్మీతులసిని పిలిపించి ఆగ్రహం వ్యక్తం చేశారు. డీసీ ఛైర్మన్లు, రైతులు గుడ్లవల్లేరు డివిజన్ డీ ఈ శ్రీనివాస్ పనితీరు అధ్వానంగా ఉందని, నిర్లక్ష్యంగా పనిచేస్తున్నాడని ఆరోపించగా మంత్రి ఆయన్ను పిలిపించి విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటానన్నారు.

పెడనలో..

పెడన: జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఇరిగేషన్ శాఖాధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం సాయంత్రం ఆయన పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఇరిగేషన్ అధికారులు, సాగునీటి సంఘాల నేతలతో సమావేశం నిర్వహించారు. బంటుమిల్లి కాలువ ద్వారా శివారు పంట భూములకు సాగునీరందని విషయమై ఆయన ఇరిగేషన్ అధికారులను ప్రశ్నించారు. సరైన సమాధానం రాకపోవడంతో ఇరిగేషన్ సీఈకి ఫోన్ చేశారు. తాను ఢిల్లీలో ఉన్నానని చెప్పిన సీఈపై మంత్రి మండిపడ్డారు. తామిక్కడ పొలాల వెంట తిరుగుతుంటే ఢిల్లీలో ఏం చేస్తున్నావంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. బంటుమిల్లి కాలువ ద్వారా సాగునీరు ఎంత వదలాలి, ఇప్పుడు ఎంత వదులుతున్నారంటూ ఇరిగేషన్ అధికారులను ప్రశ్నించారు. ప్రస్తుతం 650 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నామని, 950 క్యూసెక్కులు వదలాలని చెప్పడంతో ఎందుకు 400 తగ్గించారని నిలదీశారు. పైనున్న వారు ముంపునకు గురయ్యారని చెప్పడంతో మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. కిందనున్న వారికి నీరందకపోయినా ఫర్వాలేదా అంటూ ప్రశ్నించారు. మరో 4 రోజుల్లో వచ్చి పరిశీలిస్తానన్నారు. అనంతరం ఆయన గుడ్లవల్లేరు లాకుల వద్ద నీటి విడుదలను పరిశీలించారు. మంత్రి వెంట ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, బంటుమిల్లి డీసీ ఛైర్మన్ బొర్రా కాశీ ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ ధ్యానచంద్ర

పన్ను కట్టకుంటే కఠిన చర్యలు

● కలెక్టర్ ఆదేశాలతో పన్నుల వసూళ్లకు ప్రత్యేక టీమ్‌లు

కార్పొరేషన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఖాళీస్థలాల యజమానులకు నగరపాలక సంస్థ ఝలక్ ఇచ్చేందుకు చర్యలు చేపట్టింది. నగరంలో ఖాళీ స్థలాల యజమానుల పన్నుల బకాయిలు రూ.కోట్లకు చేరుకోవడంతో వాటి వసూళ్లకు వీఎంసీ ప్రణాళిక సిద్ధం చేసింది. కలెక్టర్ ఆదేశాలతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసింది. ఈ మేరకు మంగళవారం కమిటీ మొదటి సమావేశం కమిషనర్ ధ్యానచంద్ర పర్యవేక్షణలో జరిగింది. గత ఏడాది రూ.237కోట్ల పన్నులు వసూలు చేయాల్సి ఉండగా కేవలం రూ.19 కోట్లు మాత్రమే వసూలవడంతో కమిషనర్ ధ్యానచంద్ర ఖాళీస్థలాల యజమానుల గుర్తించి పన్నులు కట్టించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ సమావేశంలో అధికారులు సిబ్బంది పన్నుల వసూలుకు చేపట్టాల్సిన కార్యచరణను కమిషనర్ ధ్యానచంద్ర అధికారులకు వివరించారు. ఖాళీ స్థలాల బకాయిలు చెల్లించకుంటే నోటీసులు జారీ చేసి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆర్డీవో కే చైతన్య, డిస్టిక్ రిజిస్టర్ దుర్గాప్రసాద్, డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జీ సృజన, చీఫ్ సిటీప్లానర్ సంజయ్ రత్నకుమార్, అసిస్టెంట్ కమిషనర్లు హెలెన్, శ్రీనివాస్, ఏయూబీ శర్మ, డిప్యూటీ సిటీ ప్లానర్ చంద్రబోస్, ఏసీ ప్లానర్లు రాంబాబు, మోహన్ బాబు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి రైతుకూ

ఖరీఫ్, రబీ పంట రుణాలు

● కేడీసీసీ బ్యాంకు ఛైర్మన్ నెట్టెం రఘురామ్



విజయవాడ సిటీ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కృష్ణాజిల్లా సహకార కేంద్ర బ్యాంకు (కేడీపీపీబీ) పరిధిలోని అర్హులైన ప్రతి రైతుకు ఈ ఏడాది ఖరీఫ్, రబీ పంట రుణాలను అందించేందుకు సంసిద్ధంగా ఉన్నామని కేడీపీపీబీ ఛైర్మన్ నెట్టెం రఘురామ్ స్పష్టం చేశారు. ఈ ఏడాది జూలై 31 నాటికి ఎన్టీఆర్, కృష్ణాజిల్లాలోని 47,014 మంది రైతులకు రూ.753.80 కోట్లను రుణాలుగా మంజూరు చేశామన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి జూలై 31 వరకు మంజూరు చేసిన రుణాల వివరాలను విజయవాడలోని కేడీపీపీబీ కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాకు వెల్లడించారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలో కేడీపీపీబీకి 425 పీఏసీఎస్‌లున్నాయని, ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వరి పంటకు ఎకరానికి రూ.50వేలు, మిర్చికి రూ.1.15 లక్షలు చొప్పున జూలై నెలాఖరు నాటికి 38వేల మంది రైతులకు రూ.341 కోట్ల రుణాలు అందజేశామన్నారు. చేపల చెరువుకు వర్కింగ్ క్యాపిటల్ రుణంగా రూ.79 కోట్లు, టర్మ్ రుణంగా రూ.225 కోట్లు, ఎస్టీ రుణాలు రూ.63.97 కోట్లు, వ్యవసాయ బంగారు రుణాలు రూ.36 కోట్లు, కౌలురైతులకు రూ.8.88 కోట్లు మంజూరు చేశామన్నారు. ఖరీఫ్ సీజన్ రుణాలు ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు మంజూరు చేస్తామని, జూలై నెలాఖరు నాటికి 82 శాతం రుణాల మంజూరు పూర్తి చేశామన్నారు. గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది రూ.134 కోట్లు అదనంగా మంజూరు చేసినట్టు తెలిపారు.

విద్యుత్ అంతరాయానికి అధికారులే బాధ్యత వహించాలి

ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పుల్లారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పుల్లారెడ్డి

విజయవాడ సిటీ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): లైన్ల మరమ్మతులు, పాడైన ట్రాన్స్‌ఫార్మర్ల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే సంబంధిత అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఏపీసీపీడీసీఎల్ ఛైర్మన్, ఎండీ పీ పుల్లారెడ్డి హెచ్చరించారు. సీపీడీసీఎల్ పరిధిలోని ఎన్టీఆర్, కృష్ణా, సీఆర్డీఏ, గుంటూరు, ప్రకాశం, పల్నాడు, బాపట్ల జిల్లాల అధికారులతో విజయవాడలోని ఎన్టీఆర్ సర్కిల్ కార్యాలయంలో సీఎండీ సమావేశమై, అధికారులకు దిశానిర్దేశం చేశారు. 33/11 కేవీ సబ్ స్టేషన్స్ సరఫరా లైన్ల అంతరాయాలను తగ్గించాలన్నారు. సిబ్బందిని, సామగ్రిని ముందుగానే సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఫిర్యాదులొస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పీఎం సూర్యఘర్ పథకాన్ని ఎస్సీ, ఎస్టీ గృహ సబ్సిడీ వివరాలను వినియోగదారులకు వివరించి, ఇంటి పై కప్పపై సోలార్ ప్యానెల్‌లు ఏర్పాటు చేసేందుకు లబ్ధిదారుల నుంచి సమ్మతి లేఖ తీసుకోవాలన్నారు. ఆర్‌డీఎస్ఎస్ పథకంలో మంజూరైన మండల ప్రాంతాల్లో 33కేవీ, 11 కేవీ వ్యవసాయ ఫీడర్లను విభజించే పనులకు త్వరగా పూర్తి చేసి ఆయా ప్రాంతాలకు 24 గంటల నిరంతర 3-ఫేస్ విద్యుత్ సరఫరా అందించాలని ఆదేశించారు. టెక్నికల్ డైరెక్టర్ మురళీకృష్ణ యాదవ్, ప్రాజెక్ట్ డైరెక్టర్ కేపీఎస్ఎస్ మూర్తి, ఫైనాన్స్ డైరెక్టర్ ఎస్ వెంకటేశ్వర్లు, ఎస్ఈ తోట శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నలుగురు ఉద్యోగులపై టీటీడీ చర్యలు

తిరుపతి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): నిబంధనలను అతిక్రమించారంటూ నలుగురు ఉద్యోగులపై టీటీడీ చర్యలకు పూనుకుంది. గతేడాది అక్టోబరు 2వ తేదీన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తిరుమల పర్యటన క్రమంలో శ్రీనివాస మంగాపురంలో విధులు నిర్వహించే బాలాజీ రంగకుమార్ అనే అర్చకుడితో పాటు తిరుపతి ఈఈ కార్యాలయంలో పనిచేసే చీర్ల కిరణ్ అనే జూనియర్ అసిస్టెంట్ క్రమశిక్షణ నిబంధనలు ఉల్లఘించి డిప్యూటీ సీఎంను అనుసరించారని విజిలెన్స్ విభాగం నివేదికలో స్పష్టం చేసింది. దీంతో ఆలయంలోకి ప్రవేశించడానికి గల కారణాలు తెలియజేయాలని ఈ ఇద్దరికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఇక, తన ఇంటిని ఇతరులకు కేటాయించడంతో పాటు ఆర్థిక లావాదేవీలు ఉన్నట్టు నిర్ధారణ కావడంతో ఆఫీస్ సబార్డినేట్ శంకర్‌ను, ప్రైవేట్ వ్యక్తులతో కలిసి వ్యాపారాలు నిర్వహించిన జూనియర్ అసిస్టెంట్ రామును సస్పెండ్ చేస్తూ టీటీడీ ఉత్తర్వులు జారీ చేసింది.

పెంచిన కరెంట్ చార్జీలను తగ్గించాల్సిందే: సీపీఐ

అమరావతి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): పెంచిన కరెంట్ చార్జీలను తగ్గించాల్సిందేనని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యుత్తు స్మార్ట్ మీటర్ల ఏర్పాటును విరమించాలని, అదానీ కంపెనీతో చేసుకున్న అన్ని ఒప్పందాలను రద్దు చేయాలని ఒక ప్రకటనలో కోరారు. ఇవే డిమాండ్లతో వామపక్షాలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్తు కార్యాలయాల వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమాలు విజయవంతమయ్యాయని, ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.

విశాఖలో జార్జియన్ నేషనల్ యూనివర్సిటీ ట్రాన్సిట్ క్యాంపస్



ఎంఓయూ పత్రాలతో వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ ప్రణవ్ గోపాల్. చిత్రంలో కమిషనర్ విశ్వనాథన్, జార్జియన్ యూనివర్సిటీ ప్రతినిధులు

విశాఖపట్నం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): యూరప్‌లో ప్రఖ్యాత జార్జియన్ యూనివర్సిటీ విశాఖపట్నంలో కార్యకలాపాల నిర్వహణకు ముందుకు వచ్చింది. సిరిపురం జంక్షన్‌లో వీఎంఆర్‌డీఏ నిర్మించిన 'ది డెక్' భవనంలో మూడో అంతస్తును అద్దెకు తీసుకుంది. దీనికి సంబంధించిన ఎంఓయూ పత్రాలను వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ ప్రణవ్ గోపాల్, కమిషనర్ విశ్వనాథన్‌లు మంగళవారం వారికి అందించారు. ఇక్కడ యూనివర్సిటీ ట్రాన్సిట్ క్యాంపస్ నిర్వహిస్తారు. పది నెలలు, అంతకంటే తక్కువ వ్యవధి కలిగిన సింగిల్ సెమిస్టర్ కోర్సులను ముందుగా ప్రారంభిస్తారు. ఆ తరువాత శాశ్వత క్యాంపస్ ఏర్పాటు చేసుకొని, అందులోకి వెళతారని వీఎంఆర్‌డీఏ వర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమంలో జార్జియన్ యూనివర్సిటీ కో ఇన్వెస్టర్ చిరాగ్ వఘేలా, ఇండియా ఆపరేషన్స్ డైరెక్టర్ వివేకానందమూర్తి, వీఎంఆర్‌డీఏ జాయింట్ కమిషనర్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

భావనపాడు తీరంలో ముగ్గురు విద్యార్థుల గల్లంతు

టెక్కలి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం భావనపాడు తీరంలో మంగళవారం సాయంత్రం సముద్ర స్నానాలకు దిగి ముగ్గురు విద్యార్థులు గల్లంతయ్యారు. శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలం మాడేవానిపేలకు చెందిన దున్న దుర్యోధన (18), పూడి జగన్నాథపురం గ్రామానికి చెందిన తిమ్మల జష్వంత్ 18, పలాస మండలం టెక్కలిపట్నానికి చెందిన రాయల రాజేష్ (19) విజయనగరం జిల్లా గజపతినగరం దరి బాలాజీ డిప్లొమో కళాశాలలో చదువుతున్నారు. మంగళవారం సాయంత్రం భావనపాడు వద్ద సముద్రస్నానానికి వెళ్లిన వీరు అలల ధాటికి కొట్టుకుని పోయారని స్థానిక మత్స్యకారులు తెలిపారు. వెంటనే సముద్రంలోకి దిగి గాలించినా ఆచూకీ లభించలేదు. అనంతరం మెరైన్ పోలీసులకు సమాచారం ఇవ్వగా.. రాత్రి వరకు గాలింపు చర్యలు కొనసాగాయి. నౌపడా ఎస్ఐ నారాయణ స్వామి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.



తల్లిపాల బ్యాంకు ప్రారంభోత్సవంలో పాల్గొన్న డీసీపీ సరిత, రెయిన్‌బో హాస్పిటల్ వైద్యులు డాక్టర్ రాంప్రసాద్, డాక్టర్ వంశీశివరామరాజు


రెయిన్‌బో హాస్పిటల్ కీలక ముందడుగు

● నవజాత శిశువులకు తల్లిపాల బ్యాంక్ ప్రారంభం

భారతీనగర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): అప్పుడే పుట్టిన పిల్లలకు ముఖ్యంగా నెలలు నిండకుండా పుట్టిన శిశువుకు తల్లిపాలు అవసరమని డీసీపీ సరిత అన్నారు. నాగార్జున నగర్ సర్వీస్ రోడ్డులోని రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్లో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా తల్లిపాల బ్యాంక్ ప్రారంభోత్సవం మంగళవారం జరిగింది. డీసీపీ సరిత ప్రారంభించి మాట్లాడుతూ తల్లిపాల బ్యాంక్‌ను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. రెయిన్‌బో హాస్పిటల్ వైద్యులు డాక్టర్ రాంప్రసాద్, డాక్టర్ వంశీ శివరామరాజు మాట్లాడుతూ అత్యవసర చికిత్స అవసరమైన రెయిన్‌బో హాస్పిటల్‌లోని నియోనాటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఎన్ఐసీయూ)లో చేరిన శిశువులు, తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న నవజాత శిశువులకు తల్లిపాలు ఓ వరం లాంటిదన్నారు. కొన్ని కారణాలతో తల్లులు పాలివ్వలేని సందర్భాల్లో ఈ మిల్క్ బ్యాంక్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. దాతల నుంచి సేకరించిన సురక్షితమైన, పాశ్చరైజ్డ్ చేసిన పాలను ఈ బ్యాంక్ ద్వారా శిశువులకు అందిస్తారన్నారు. అత్యాధునిక సదుపాయాలతో విజయవాడలో ప్రారంభించిన ఈ మదర్స్ మిల్క్ బ్యాంక్ ఏకంగా 500 లీటర్ల పాలను నిల్వచేయగల సామర్థ్యం కలిగి ఉందన్నారు. ఇప్పటివరకు 50 మంది దాత తల్లుల ఔదార్యంతో విజయవాడలో 100 మందికి పైగా శిశువులు ప్రయోజనం పొందారన్నారు. పాలు దానం చేయాలనుకునే తల్లులకు రెయిన్‌బో హాస్పిటల్ స్వాగతం పలుకుతోందన్నారు. ఆసక్తి ఉన్నవారు టోల్ ఫ్రీ నెంబర్ 9703771222లో లాక్టేషన్ సపోర్ట్ టీమ్‌ను సంప్రదించి, అవసరమైన సలహాలు, శిక్షణ పొందవచ్చని యాజమాన్యం తెలిపారు. డాక్టర్ బీఎస్‌సీపీ రాజు, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ భ్రజిష్ట, హాస్పిటల్ యాజమాన్యం పాల్గొన్నారు.

జగన్ పాలనలో భ్రష్టుపట్టిన విద్యావ్యవస్థ

● శాప్ ఛైర్మన్ రవినాయుడు



లోగో ఆవిష్కరిస్తున్న శాప్ ఛైర్మన్ రవినాయుడు

విజయవాడ స్పోర్ట్స్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల జగన్‌రెడ్డి పాలనలో విద్యావ్యవసను భ్రష్టుపట్టించారని, విద్యార్థుల సమస్యలపై ప్రశ్నించిన విద్యాసంఘాల నేతలను అక్రమంగా అరెస్టులు చేయించిన దౌర్భాగ్య పరిస్థితులు నెలకొన్నాయని శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు వ్యాఖ్యానించారు. రెవల్యూషనరీ స్టూడెంట్ యూనియన్ (ఆర్ఎస్‌యూ) 10వ రాష్ట్ర మహాసభలకు సంబంధించిన లోగో, పోస్టర్‌ను విజయవాడలోని శాప్ కార్యాలయంలో శాప్ ఛైర్మన్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో ఐటీ మంత్రిగా పనిచేసిన అమర్‌నాథ్ కోడిగుడ్డుపై వెంట్రుకలు పీకడానికి కూడా సరిపోడన్నారు. విద్యా వ్యవస్థ బలోపేతానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి లోకేశ్ విప్లవాత్మక మార్పులు, సంస్కరణలు తెస్తున్నారన్నారు. అనంతరం ఆర్ఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రవిశంకర్ రెడ్డి మాట్లాడుతూ సెప్టెంబరు 12, 13, 14న అమరావతి వేదికగా రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నామన్నారు. యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

క్రీడాభివృద్ధికి పనులు వేగవంతం

నిర్దిష్టమైన ప్రణాళికతో రాష్ట్రంలో క్రీడాభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నామని శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు పేర్కొన్నారు. స్టేడియంలోని శాప్ కార్యాలయంలో మంగళవారం శాప్ 85వ సమావేశం జరిగింది. శాప్ ఎండీ అజయ్ జైన్, బోర్డు సభ్యులు పాల్గొని పలు నిర్ణయాలకు ఆమోదం తెలిపారు. గత బోర్డుమీటింగ్‌లో తీర్మానించిన అంశాలు, కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు. శాప్ అధికారులు, బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	105, 113, 124
చికెన్ విత్ స్కిన్	200
చికెన్ స్కిన్‌లెస్	210

నెక్ కోడిగుడ్లు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 475

కొండాలమ్మను దర్శించుకున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ గీతాంజలి శర్మ

గుడ్లవల్లేరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : వేమవరం కొండాలమ్మ అమ్మవారిని కృష్ణాజిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ గీతాంజలిశర్మ వారి తల్లి తండ్రులతో కలసి దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి దర్శనం చేయించారు. అనంతరం ఆలయ ఆచారం ప్రకారం గీతాంజలిశర్మను వారి కుటుంబ సభ్యులను సన్మానించారు. అమ్మవారి ప్రసాదం, చిత్రపటాలను బహూకరించారు.



గీతాంజలిశర్మను సత్కరిస్తున్న సిబ్బంది



సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వెనిగండ్ల

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

● ఎమ్మెల్యే వెనిగండ్ల

గుడివాడ, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ అభివృద్ధి, ప్రజాసమస్యల పరిష్కారానికే తొలి ప్రాధాన్యతిస్తున్నామని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ప్రజావేదికలో ప్రజల నుంచి సమస్యల అర్జీలను స్వీకరించారు. నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ సింగలూరు గ్రామస్థులు, సామాజికవేత్త డాక్టర్ బండారు శ్యామ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వెనిగండ్లకు వినతిపత్రం అందజేశారు. నీటి సమస్య పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయకత్వంలో ప్రజాశ్రేయస్సే లక్ష్యంగా కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. గుడివాడ అభివృద్ధితో పాటుగా ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రాధాన్యతనిస్తున్నామన్నారు. టీడీపీ నాయకులు రామరాజు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

బిడ్డకు తల్లిపాలే శ్రేష్ఠం

పెదపారుపూడి : అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లిపాలే శ్రేష్ఠమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మనిముక్క శివనాగమణి పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా వానపాముల అంగన్‌వాడీ కేంద్రం-2లో మంగళవారం తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డకు తల్లిపాలు పట్టడం వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ లాంటివి రావని, కాన్పుకు కాన్పుకు మధ్య గ్యాప్ ఉంటుందని తెలిపారు. అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు, ఆశా కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

జాతీయ రహదారా .. డంపింగ్‌యార్డా..!

● రోడ్ల వెంబడి గుట్టలుగా పడేసిన చెత్త
● ప్రయాణికులకు తప్పని తిప్పలు
● పట్టించుకోని అధికారులు

(ఆంధ్రజ్యోతి - పామర్రు): పెదమద్దాలి గ్రామ పంచాయతీ పరిధిలోని మచిలీపట్నం - విజయవాడ ప్రధాన జాతీయ రహదారి చెత్తడంపింగ్ యార్డును తలపిస్తుంది. ఓ వైపు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛతకు అధిక ప్రాధాన్యత నిస్తూ, స్వచ్ఛభారత్ పేరుతో ప్రజలకు అవగాహన కల్పిస్తుంటే దానిని అమలు చేయాల్సిన సంబంధిత పంచాయతీ అధికార సిబ్బంది నిబంధనలకు నీళ్లు చల్లుతున్నారనే విమర్శలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి. మండలంలో మేజర్ పంచాయతీగా ఉన్న పెదమద్దాలిలో తడి, పొడిచెత్త వేర్వేరుగా సేకరించి డంపింగ్ యార్డుకు తరలించి చెత్తనుంచి సంపద సృష్టించాల్సిందిపోయి, మచిలీపట్నం- విజయవాడ వెళ్లే జాతీయ రహదారిపై చెత్తను వేస్తున్నారు. దీంతో ఈ రహదారిపై ప్రయాణించాలంటే వాహనదారులు ముక్కుమూసుకోవాల్సిందేనని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారి వెంబడి వ్యర్థాలు పడవేయడం వల్ల తమ పంటకు నష్టం కలుగుతుందని పలుమార్లు పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లినప్పటికి పట్టించుకోవడంలేదని సమీపంలోని రైతులు మండిపడుతున్నారు.

చెత్త వేయకుండా చర్యలు చేపడతా

జాతీయ రహదారిపై గుడివాడ ఫ్లైఓవర్ దిగువ ప్రాంతంలో చెత్త పడవేయకుండా చర్యలు తీసుకుంటాం. ఆప్రాంతంలో పేరుకు పోయిన చెత్తగుట్టలను గ్రామంలోనే డంపింగ్ యార్డుకు తరలిస్తాం.

పూర్ణచంద్రరావు , పంచాయతీ కార్యదర్శి



పెదమద్దాలి వద్ద డంపింగ్ యార్డును తలపిస్తున్న చెత్త, చెదారాలు



జాతీయ రహదారి వెంబడి పోసిన చెత్త, చెదారాల గుట్టలు

కూటమితోనే సుస్థిర పాలన సాధ్యం

● ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

పమిడిముక్కల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమం, అభివృద్ధి పథకాలను జీర్ణించుకోలేని వైసీపీ నాయకులు దుష్ప్రచారం చేస్తూ విషం కక్కుతున్నారని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా దుయ్యబట్టారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా మంగళవారం కపిలేశ్వరపురం స్థానిక నాయకులతో కలిసి పర్యటించి ప్రభుత్వం అమలుజేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి, యువతకు ఉపాధి, ఉద్యోగాల కల్పన లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన చేస్తుంటే గిట్టని వైసీపీ విధ్వంసం, విషంచిమ్మేందుకు ప్రయత్నిస్తుందని ఆరోపించారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా కేంద్రంతో కలిసి రూ.7వేలు రైతుల ఖాతాల్లో ప్రభుత్వం వేసిందన్నారు. ఈ నెల 15 నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం కల్పించిందన్నారు. నాయకులు సాయిదత్తు, బాబి, బాబూరావు, వెంకటేశ్వరరావు, రాజేంద్రప్రసాద్, ఫ్రాన్సిస్ పాల్గొన్నారు.



కపిలేశ్వరపురంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

కలుపు మొక్కల నివారణే ధ్యేయం

● ఏవో బోలెం అనంతలక్ష్మీ

గుడివాడ రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): వరి పొలాల్లో కలుపు మొక్కలు తక్కువగా ఉన్నప్పుడే నివారణ చర్యలు తీసుకోవాలని ఏవో బోలెం అనంతలక్ష్మీ అన్నారు. మంగళవారం బొమ్ములూరులో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు రెండు, మూడు ఆకులు ఉన్నప్పుడే కలుపు నివారణ చర్యలు తీసుకున్నట్లైతే వెంటనే కలుపు తగ్గుతుందని తెలిపారు. ప్రతి రైతూ ఎక్కువ మందు కాకుండా తక్కువ కలుపు మందు వాడాలన్నారు. రైతులు ఎక్కువగా రసాయనిక ఎరువులు వినియోగించవద్దని తెలిపారు. బయోటెక్ మందులను వాడాలని కోరారు. యూరియా రైతులందరికీ అందుతుందని తెలిపారు. కొంతమంది రైతులు యూరియా తగ్గుతుందేమోనని భయపడి 10 కట్టలకు బదులు 20 బస్తాలు అనవసరంగా నిల్వ చేసుకుంటున్నట్టు తెలిపారు. ఈ విధంగా నిల్వ చేసుకోవటం ద్వారా మిగిలిన రైతులకు కష్టమవుతుందని తెలిపారు. అందరికీ యూరియా అందించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బొమ్ములూరు రైతులు, తదితరులు పాల్గొన్నారు.



బొమ్ములూరులో రైతులతో మాట్లాడుతున్న అనంతలక్ష్మీ

మెరక చేసుకోవటానికే మట్టి తోలకాలు

నందివాడ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఇళ్ల స్థలాలు పల్లంగా ఉండటంతో కొద్దిపాటి వర్షానికే ఇళ్ల చుట్టూ నీళ్లు నిలిచి దుర్వాసన, దోమల బెడదతో అల్లాడిపోతున్నామని నందివాడ ఎస్టీ, ఎస్సీ కాలనీ వాసులు మనోజ్, రవిలు మంగళవారం ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం అంధ్రజ్యోతిలో వచ్చిన అక్రమ మట్టి తోలకాలు అంటూ వచ్చిన కథనంపై మనోజ్, రవిలు స్పందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత మే నెలలో చేపల చెరువు నీళ్ల కోసం రోడ్డు పక్కన ఉన్న బోదె ఎక్సకవేటర్‌తో తవ్వి రోడ్డు ప్రక్కన గుట్టలుగా పోశారు. ఆ మట్టిని తాము ఇళ్లకు తోలుకున్నామన్నారు. మురుగు బోదె పూడుకుపోయి ఉండటంతో బోదిలో నుంచి తీసిన మురుగు మట్టిని గుట్టలుగా ఉండటంతో తాము ఆ మట్టిని తోలుకున్నామే తప్ప ఎవరిది అక్రమంగా తోలుకోలేదన్నారు. ఎవరికీ సంబంధం లేని ఇద్దరు వ్యక్తులు కావాలనే తమపై కేసు పెట్టి అల్లరి చేయటం దారుణమన్నారు. ఇళ్ల మెరకల కోసం రోడ్డు ప్రక్కన గుట్టలుగా ఉన్న మట్టి తోలుకోవటం కూడా నేరమేనా అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తాము మట్టి తోలుకున్న ప్రాంతాన్ని పరిశీలించాల్సిందిగా కోరుతున్నామన్నారు.



మట్టి తోలిన ప్రదేశం పక్కన మురుగు బోది

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

గుడివాడ రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఎరువుల షాపుల యజమానులు ఎక్కువ రేట్లకు ఎరువులు అమ్మితే వారిపై తగు చర్యలు తీసుకుంటామని ఏవో బోలెం అనంతలక్ష్మీ హెచ్చరించారు. మంగళవారం ఎరువుల షాపులు తనిఖీ చేసి యూరియా ఎంత మోతాదులో ఉన్నది, ఎంత క్వాంటిటి ఉందనేది పరిశీలించారు. యూరియా కొంటేనే వేరే మందులు అమ్ముతామని ఆంక్షలు పెడితే ఊపేక్షించేది లేదని తెలిపారు. షాపుల్లో ఉన్నంత వరకు ప్రతి రైతుకు యూరియా అందించాలన్నారు. షాపులకు వచ్చిన రైతులతో మాట్లాడి యూరియా అందించారు. కృత్రిమ కొరత సృష్టిస్తే తగు చర్యలు ఉంటాయని తెలిపారు. ఎరువులు కొనుగోలు చేస్తే రశీదులు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు, ఎరువుల షాపుల యజమానులు పాల్గొన్నారు.



ఎరువుల షాపులు పరిశీలిస్తున్న ఏవో అనంతలక్ష్మి

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

గుడివాడ, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ మాజీ ప్రతిపక్ష నేత, గణపతి లక్ష్మణరావు 10వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన కుటుంబసభ్యులు, గణపతియూత్ ఆధ్వర్యంలో మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో 2024-25 పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన 18మంది విద్యార్థులకు రూ.36వేల నగదు ప్రోత్సాహకాలు, బహుమతులను అందజేశారు. మంగళవారం స్థానిక కాకర్ల వీధిలో తొలుత గణపతి లక్ష్మణరావు సంతాప సభను నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పట్టణంలోని వృద్ధాశ్రమాల్లో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ గుదే లక్ష్మీరంగనాయకమ్మ, మాజీ కౌన్సిలర్ మాదాసు వెంకటలక్ష్మి, వైసీపీ నాయకులు అద్దేపల్లి పురుషోత్తం, పండు, లోయ రాజేష్, దుబా రాజేష్, గణపతి కుటుంబసభ్యులు శివ, గణపతి విజయలక్ష్మీ, మెంటు గోవిందమ్మ పాల్గొన్నారు.



నగదు ప్రోత్సాహకాలు అందుకున్న విద్యార్థులు

తాడంకి ఊరచెరువుల వేలం పాట రేపు

పమిడిముక్కల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : తాడంకి గ్రామపంచాయతీ పరిధిలో రాములక్క చెరువు, గంగరాయి చెరువు, మంగళవాని గుంట చెరువుల ఫలసాయం 2025- 2026, 2026-2027, 2027-2028 మూడు సంవత్సరాలకు గురువారం ఉదయం 11 గంటలకు గ్రామపంచాయతీ కార్యాలయంలో బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్టు పంచాయతీ కార్యదర్శి భవాని తెలిపారు. ఆసక్తి కలవారు రూ. 10వేల ధరావతు చెల్లించి పాటలో పాల్గొన వచ్చని తెలిపారు.

కాజలో మన మిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ర్యాలీ

కూచిపూడి : ప్రభుత్వం ప్రవేశపెట్టిన మన మిత్ర వాట్సాప్ ద్వారా ప్రభుత్వం అందించే సేవలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు కాజ గ్రామపంచాయతీ వారు మన మిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ కొడాలి భవాని, గ్రామపంచాయతీ కార్యదర్శి రాంబాబు పాల్గొన్నారు.

హుండీలో నగదు చోరీ ..

● ముగ్గురు మైనర్లు అరెస్టు

కూచిపూడి, ఆగస్టు5 (ఆంధ్రజ్యోతి): పెదపూడి సాయిబాబా ఆలయంలో హుండీ పగులకొట్టి నగదు అపహరించిన సంఘటనలో పెడన మండలం బ్రహ్మపురానికి చెందిన ముగ్గురు మైనర్లను అరెస్టు చేసినట్లు కూచిపూడి ఎస్ఐ కె.ఎస్.విశ్వనాథ్ తెలిపారు. వీరిపై పెడన పోలీస్ స్టేషన్‌లో పలు దొంగతనం కేసులు, కోళ్ల దొంగతనం కేసులు ఉన్నట్టు విచారణలో తేలినట్లు ఎస్సై తెలిపారు. కాగా సోమవారం రాత్రి పెదపూడి రామాలయంలో గుర్తు తెలియని వ్యక్తులు హుండీ పగులకొట్టి చోరీకి పాల్పడినట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదే తరహాలో పెడననగల్లు రోడ్డులోని సంపత్ గణపతి ఆలయంలోనూ ఇటీవల చోరీ జరిగినట్లు గ్రామస్థులు తెలిపారు. వరుస దొంగతనాలతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

వృద్ధురాలి మృతదేహం గుర్తింపు

తోట్లవల్లూరు : రొయ్యూరులో ఈ నెల 3వ తేదీన కేఈబీ కెనాల్లో పడిన లుక్కా వెంకటేశ్వరమ్మ(67) మృతదేహాన్ని మంగళవారం డ్రోన్ ద్వారా గాలించగా దేవరపల్లి వద్ద లభ్యమైందని సీఐ వై చిట్టిబాబు తెలిపారు. గత రెండు రోజుల గాలింపులో వెంకటేశ్వరమ్మ ఆచూకీ లభ్యం కాకపోవటంతో డ్రోన్ సహాయంతో గాలింపు చేపట్టాలని గుడివాడ డీఎస్పీ ధీరజ్ వినీల్ ఆదేశించారని తెలిపారు. దేవరపల్లి వద్ద కాలువలో వెంకటేశ్వరమ్మ మృతదేహాన్ని కనుగొని పోస్టుమార్టంకు తరలించామని తెలిపారు.

ఎవరు అవినీతిపరులో చర్చకు సిద్ధం

● వీరంకి వెంకట గురుమూర్తి

తోట్లవల్లూరు : బాపులపాడు నుంచి ట్రంకు పెట్టెతో పామర్రు వచ్చి ఎమ్మెల్యేగా ఐదేళ్ల కాలంలో ఎంత అక్రమ సంపాదనకు పాల్పడ్డారో నిరూపించేందుకు సిద్ధమని, దమ్ముంటే చర్చకు రావాలని రాష్ట్ర గౌడ కార్పొరేషన్ ఛైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్‌కు సవాల్ విసిరారు. తోట్లవల్లూరు టీడీపీ కార్యాలయంలో మంగళవారం రాత్రి మండల టీడీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల టీడీపీ అధ్యక్షుడు వీరపనేని శివరామ్‌ప్రసాద్ టీడీపీ నాయకులు చింతపల్లి వెంకటేశ్వరరావు, నెక్కలపూడి మురళీ, సర్పంచ్ శివశంకర్, పాముల శ్రీనివాసరావు, పలు గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

కైలేపై వ్యంగ్య వాఖ్యలు సరి కాదు

● ఎంపీపీ గోగం సురేష్

పెదపారుపూడి: రైతుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్‌పై ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా వ్యంగ్యంగా వ్యాఖ్యలు చేయటం సరికాదని వైసీపీ మండల అధ్యక్షుడు, ఎంపీపీ గోగం సురేష్ మండిపడ్డారు. పెదపారుపూడి మండలం వెంట్రప్రగడ గ్రామంలో వైసీపీ నాయకులు మండవ బెనర్జీ ఇంటి వద్ద మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ మండలంలో వైసీపీ హయాంలో జగనన్న కాలనీల పేరుతో 15 ఎకరాల భూమిని సేకరించి దాదాపు 600 మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చామన్నారు. చీకుర్తి వరప్రసాద్, గోళ్ల సోమేశ్వరరావు, శివరాం ప్రసాద్ పాల్గొన్నారు.

చెస్ పోటీల్లో స్టేడియం క్రీడాకారిణి ప్రతిభ

గుడివాడ, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రమైన మచిలీపట్నం, సన్‌స్టార్ పాఠశాలలో ఎస్.ఆర్.ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఓపెన్ బాలికల చెస్ పోటీల్లో గుడివాడ ఎన్టీఆర్ స్టేడియం క్రీడాకారిణి గొట్టిపల్లి హర్షిత అండర్-7 విభాగంలో వెండిపతకం సాధించినట్టు ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం స్థానిక స్టేడియం కార్యాలయంలో వెండి పతక గ్రహీత హర్షిత, స్టేడియం చెస్ కోచ్ జి.మణి దీపికలను ఆయన అభినందించారు. స్టేడియం కమిటీ సంయుక్త కార్యదర్శి కిలారపు రంగప్రసాద్, పాల్గొన్నారు.



హర్షితను అభినందిస్తున్న యలవర్తి శ్రీనివాసరావు

ఖో-ఖో అండర్-22 సెలక్షన్ ట్రయల్స్ నేడు

గుడివాడ, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి) : జాతీయ క్రీడాదినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం, శాప్, జిల్లా స్పోర్ట్స్ అథారిటీల ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో అండర్-22 బాలుర, బాలికల విభాగంలో ఈ నెల 6వ తేదీన జిల్లా జట్టు సెలక్షన్ ట్రయల్స్ నిర్వహించనునట్టు ఖో-ఖో ఇన్‌చార్జ్ మడకా ప్రసాద్ మంగళవారం ప్రకటనలో తెలిపారు.

మంత్రి టీజీ భరత్ జన్మదిన వేడుకలు

గుడివాడ : ఆర్యవైశ్య కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గోకవరపు సునీల్ ఆధ్వర్యంలో రాష్ట్రమంత్రి టీజీ భరత్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంగళవారం స్థానిక నెహ్రూచౌక్ సెంటర్‌లో మంత్రి టీజీ భరత్ జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన కేక్‌ను గోకవరపు కట్ చేశారు. ఈ సందర్భంగా గోకవరపు మాట్లాడుతూ రాష్ట్ర రాజకీయాల్లో తమకంటూ ప్రత్యేక గుర్తింపు పొందిన టీజీ వారసుడిగా వచ్చిన టీజీ భరత్ ప్రజల మన్ననలతో రాజకీయాల్లో విజయవంతంగా ముందుకు వెళుతున్నారన్నారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు గంగరాజు, మోహనరావు, సాంబశివరావు, మురళీ, వెంకటసుబ్బారావు, హరిప్రసాద్, మునగ గంగాధరరావు, తాడికొండ శివ, తాడిపత్రి సురేష్, జిల్లా రఘు, టీడీపీ నాయకులు, భరత్ అభిమానులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ ధీరజ్‌వినీల్

● డీఎస్పీ ధీరజ్‌వినీల్

గుడ్లవల్లేరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : నేటి తరం యువత ముఖ్యంగా విద్యార్థులు ఓటమిని తట్టుకోలేకపోవడం, మాదకద్రవ్యాలు, ర్యాగింగ్ అనే మూడు సమస్యలతో సతమతమౌతున్నారని గుడివాడ డీఎస్పీ ధీరజ్‌వినీల్ అన్నారు. మంగళవారం గుడ్లవల్లేరులో శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల(ఎస్ఆర్‌జీఈసీ)లో ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఆయన ర్యాగింగ్, డ్రగ్స్ నివారణలపై అవగాహనా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ రాగింగ్ కేసు నమోదు చేస్తే తీవ్రమైన, కఠినమైన శిక్షలు ఉంటాయన్నారు. గుడివాడ రూరల్ సీఐ సోమేశ్వరరావు, తహసీల్దారు బి.లోకరాజు, ఎస్సై ఎన్.వి.వి.సత్యనారాయణ పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు వద్దు .. విద్యుత్ భారాలు తగ్గించాలి

● ఆర్‌సీపీ రెడ్డి, గూడపాటి ప్రకాష్‌బాబు



గుడివాడలో..

గుడివాడ,ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి) : అదానీ స్మార్ట్‌మీటర్ల బిగించడాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో ప్రజలతో కలిసి ఆందోళనను ఉధృతం చేస్తామని వామపక్ష నాయకులు ఆర్‌సీపీ రెడ్డి, గూడపాటి ప్రకాష్‌బాబులు హెచ్చరించారు. స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును వెంటనే నిలుపుదల చేయాలని కోరుతూ వామపక్ష నాయకులు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఏలూరురోడ్డులోని విద్యుత్ శాఖ ఈఈ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం సబ్ స్టేషన్ ఎలక్ట్రికల్ డీఈ నిరంజన్‌కు 2000మంది సంతకాలతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. ఈ ధర్నాలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్.సమరం, రజిని పాల్గొన్నారు.

గుడివాడ రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలను సర్దుబాటు పేరుతో గృహ వినియోగదారులపై పెనుభారం మోపిందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌సీపీ.రెడ్డి అన్నారు. మంగళవారం మోటూరులో పెంచిన కరెంట్ బిల్లులు తగ్గించాలని, స్మార్ట్ మీటర్లు బిగించవద్దని సంతకాల సేకరణ నిర్వహించి పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. కౌలు రైతు సంఘం నాయకుడు దివి వెంకటేశ్వర్లు, అశోక్, ఉప్పాడ రాజా పాల్గొన్నారు.

కూచిపూడి : వినియోగదారులపై భారం మోపే స్మార్ట్ మీటర్లు బిగించటం ఆపాలని కోరుతూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో వామపక్ష పార్టీల నేతలు మంగళవారం కూచిపూడిలో ధర్నా నిర్వహించారు. అనంతరం మొవ్వ విద్యుత్ సబ్ స్టేషన్ అధికారులకు ప్రజల నుంచి సేకరించిన 1300 సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. అలాగే ఆవిరిపూడి గ్రామసచివాలయం ఎదుట బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ప్రజా సంఘాలు, వామపక్ష పార్టీల నేతలు శీలం నారాయణరావు, చెరకు శ్రీనివాసరావు, పామర్తి కోటేశ్వరరావు, మురహరిరెడ్డి, పాల్గొన్నారు.



పామర్రులో..



కూచిపూడిలో..

పామర్రు: ప్రజలకు పెనుభారంగా నిలిచే విద్యుత్ స్మార్ట్‌మీటర్ల బిగింపును తక్షణమే ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని పామర్రు డివిజన్ సీఐటీయూ కార్యదర్శి ఒడుగు గంగాధర్ ప్రసాద్ అన్నారు. స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ఆందోళన నిర్వహించారు. వేము పెదబాబు, ఇంటిరాజు, మండల సీపీఎం కార్యదర్శి కాటూరి నాగభూషణం, పాల్గొన్నారు.

తోట్లవల్లూరు : స్మార్ట్‌మీటర్లను తొలగించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం తోట్లవల్లూరులో సీపీఎం నాయకులు ఆందోళన నిర్వహించారు. కె కొండలుబాబు, జె ఏసేబు, యేమినేని సాంబయ్య, ఈడ్పుగంటి డేవిడ్‌రాజులు తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. తహసీల్దార్ ఎం కుసుమ కుమారికి వినతి పత్రం అందించారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	105, 113, 124
చికెన్ విత్ స్కిన్	200
చికెన్ స్కిన్‌లెస్	210

నెక్ కోడిగుడ్ల ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 475


మంత్రి అచ్చెన్నాయుడు, ఆప్కాబ్ చైర్మన్ వీరాంజనేయులు నుంచి అవార్డు అందుకుంటున్న చంద్ర రవికుమార్

మంగళాపురం సొసైటీకి ఉత్తమ పనితీరు అవార్డు

చల్లపల్లి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : మంగళాపురం పీఏసీఎస్‌కు 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఉత్తమ పనితీరు అవార్డు లభించింది. విజయవాడలో జరిగిన కార్యక్రమంలో మంత్రి అచ్చెన్నాయుడు, ఆప్కాబ్ చైర్మన్ వీరాంజనేయులు, కేడీసీసీ బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురాం, కేడీసీసీ బ్యాంకు సీఈవో ఎ.శ్యామ్ మనోహర్ చేతుల మీదుగా మంగళాపురం సొసైటీ సీఈవో చంద్ర రవికుమార్ అవార్డు అందుకున్నారు.


మచిలీపట్నం-కోన రహదారికి ఇరువైపులా మార్జిన్‌లో నామమాత్రంగా వేసిన రబ్బీసు

రహదారి పనుల్లో కాంట్రాక్టర్ కక్కుర్తి

● నామమాత్రంగా పనులు చేయడంపై ప్రజల ఆగ్రహం

మచిలీటప్నం- ఆంధ్రజ్యోతి : మచిలీపట్నం-కోన రహదారి అభివృద్ధి పనుల్లో కాంట్రాక్టర్ తీరును ప్రజలు విమర్శిస్తున్నారు. పనులు తూతూ మంత్రంగా చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల మచిలీటప్నం-కోన రహదారిని అభివృద్ధి చేశారు. ఈ రోడ్డు వెంబడి ఆటోమేటిక్ కాల్వ కల్వర్టు నుంచి గుండేరు వంతెన వరకు తారు రోడ్డుకు ఇరువైపులా రహదారి మార్జిన్‌ను సక్రమంగా వేయకుండా కాంట్రాక్టర్ మమ అనిపించాడు. రోడ్డుకు ఇరువైపులా మార్జిన్‌లో కనీసంగా మీటరు వెడల్పున రబ్బీసు వేయాల్సి ఉంది. మంత్రులు ఎవరైనా గ్రామాల్లో పర్యటనకు వచ్చే సమయంలో రహదారికి ఇరువైపులా సున్నం, బ్లీచింగ్ చల్లినట్లుగా, రహదారి మార్జిన్‌లకు రబ్బీసు వేసి కాంట్రాక్టర్ సరిపెట్టేశాడు. కాంట్రాక్టర్ ఇంత నిర్లక్ష్యంగా పనిచేస్తే, ఆర్ అండ్ బీ అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు.


కోడూరులో పీఎం సూర్యఘర్ కింద ఏర్పాటు చేసిన సోలార్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న ఎస్‌బీఐ మేనేజర్ సౌమ్యశ్రీ

పీఎం సూర్యఘర్ ఎంతో ప్రయోజనకరం

కోడూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రధాన మంత్రి సూర్యఘర్ పథకం విద్యుత్ వినియోగదారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఏడీఈ నడకుదుటి సుబ్రహ్మణ్యం అన్నారు. మంగళవారం నాటికి 200 కనెక్షన్లు తమ పరిధిలోని మూడు మండలాల్లో పూర్తి అయిన సందర్భంగా కోడూరులో 200 యూనిట్ ఇన్‌స్టాలేషన్ కార్యక్రమాన్ని కోడూరు స్టేట్ బ్యాంక్ మేనేజర్ జి.సౌమ్యశ్రీ రిబ్బన్ కట్ చేయించి ప్రారంభించారు. సూర్యకాంతిని వినియోగించుకోవటం వల్ల విద్యుత్ బిల్లుల్లో గణనీయమైన తగ్గుదల కనిపిస్తుందన్నారు. రూ. 1000పైన కరెంట్ బిల్లులు వస్తున్న ఇంటి యజమానులు ఈ పథకాన్ని వినియోగించుకో గలిగితే మంచి లబ్ధి కలుగుతుందన్నారు. యూనియన్ బ్యాంక్ మేనేజర్ పి.ఉదయ్ కుమార్, కోడూరు మండల విద్యుత్ ఏఈ కంచర్ల గోపిచంద్, సిబ్బంది పాల్గొన్నారు.

అధికార భాషా సంఘానికి మండలి పేరు హర్షణీయం

●ఏడాది పాడవునా ఎంవీకే విగ్రహానికి నివాళులర్పిస్తాం : స్వర్ణలత



నాగాయలంక, ఆగస్టు5 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘానికి మాజీ మంత్రి మండలి వెంకట కృష్ణారావు పేరును ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించడం హర్షణీయమని తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం వెంకట కృష్ణారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. శత జయమంతి ఉత్సవాలు సందర్భంగా నాగాయలంకలో మండలి వెంకట కృష్ణారావు విగ్రహానికి సంవత్సరం పాటు పుష్పమాల వేసే కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నట్లు తలశిల స్వర్ణలత తెలిపారు. భావదేవరపల్లి సర్పంచ్ మండలి ఉదయభాస్కర్, రేమాల బాబురావు, భోగాది శివవిష్ణు, బండ్రెడ్డి హరి, తోట మానస, మాదివాడ అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

యూరియా కొరతతో రైతుల అవస్థలు

మోపిదేవి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే రైతులు ఎరువుల కొరత రూపంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని 13 గ్రామ పంచాయతీల్లోనూ 4331 హెక్టార్లలో వరి పంట సాగు చేస్తున్నారు. ప్రస్తుతం ఐదు వేల ఎకరాల వరకు 40 శాతం మేర వరి నాట్లు పూర్తి అయ్యాయి. మండలంలో అధికంగా వెదసాగు అవలంబించటం జరిగింది. పెదకళ్లేపల్లి, వెంకటాపురం, మెరకనపల్లి, శివరామపురం, పెదప్రోలు గ్రామాల్లో వెద సాగు చేయటంతో రైతులకు ఎరువుల అవసరం ఉంది. ప్రస్తుతం మండలంలోని ప్రాథమిక సహకార సంఘాలు, రైతు సేవా కేంద్రాల్లో రైతులకు అవసరమైన యూరియా, డీఏపీ అందుబాటులో లేకపోవటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో ప్రైవేట్ దుకాణాల్లో యూరియా అమ్మకాలు లేకపోవటంతో రైతులు ఎప్పుడు వస్తుందా అంటూ ఎదురు చూస్తున్నారు. ఇప్పటికీ 15 రోజులుగా సహకార సంఘాల్లో యూరియా అందుబాటులో లేకపోవటంతో పంట అదును దాటుతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ అధికారులు ముందస్తు అంచనాలు లేక, ఎరువులు అందుబాటులో ఉంచకపోవడం వల్లే రైతులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడిందంటున్నారు. యూరియా, డీఏపీ ఎరువులు రైతు సేవా కేంద్రాలు, పీఏసీఎస్‌లలో అందుబాటులో ఉంచాలని రైతులు కోరుతున్నారు.

రేపు, మాపు అంటూ తిప్పుతున్నారు!



పెదప్రోలు గ్రామంలో మూడు ఎకరాలు కౌలు వ్యవసాయం చేస్తున్నాను. పది రోజులుగా యూరియా, డీఏపీ కోసం ఎదురుచూస్తున్నాను. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, రైతు సేవా కేంద్రాల చుట్టూ తిరుగుతుండగా, రేపు, మాపు అంటు దాట వేస్తున్నారే కానీ ఎరువులు మాత్రం అందుబాటులోకి రావటం లేదు.
- కైతేపల్లి లక్ష్మణరావు, పెదప్రోలు, కౌలు రైతు


మోపిదేవి పీఏసీఎస్ వద్ద యూరియా లేదంటూ తెలియజేస్తున్న నోటీసు బోర్డు

యూరియా కొరత లేదు : ఏడీఏ

అవనిగడ్డ రూరల్ : అవనిగడ్డ నియోజకవర్గంలో యూరియా కొరత లేదని ఏడీఏ జయప్రద మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. అవనిగడ్డ, నాగాయలంక, చల్లపల్లి, మోపిదేవి, కోడూరు, ఘంటసాల మండలాల్లో సాగు విస్తీర్ణం 33,424 హెక్టార్లకు గానూ ఇప్పటి వరకు 9137 హెక్టార్లు విస్తీర్ణం నాట్లు వేయటం జరిగిందన్నారు. ఇప్పటి వరకు సాగు అయిన విస్తీ ర్ణానికి యూరియా 2056 మెట్రిక్ టన్నులు అవసరం ఉందని, ఇందుకు పీఏసీఎస్‌లలో 1058 మెట్రిక్ టన్నులు, ప్రైవేట్ డీలర్లు దగ్గర 2678 మెట్రిక్ టన్నులు మొత్తం కలపి 3736 మెట్రిక్ టన్నులు ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఇప్పటి వరకు వచ్చిందని తెలిపారు. ప్రస్తుతం యూరియా నిల్వలు 1322 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నట్లు తెలియజేశారు.


పంట పొలాలను పరిశీలించి రైతులకు సూచనలు చేస్తున్న ఏవో హెబ్సిబా రాణి

అధిక మోతాదులో ఎరువులు వాడొద్దు

మోపిదేవి : వరి పంటలో అధిక మోతాదులో ఎరువుల వాడకాన్ని తగ్గించి రైతులు ఆర్థికంగా ప్రయోజనం పొందాలని వ్యవసాయ శాఖాధికారిణి హెబ్సిబా రాణి తెలియజేశారు. కొక్కిలిగడ్డ, కె.కొత్తపాలెం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వరినాట్లు వేసిన పొలాలు, వెద సాగు చేపట్టిన పొలాలను రైతులతో కలసి ఆమె పరిశీలించారు. వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు, భూసార పరీక్షల నివేదికల ప్రకారమే తగిన మోతాదులో ఎరువులు వాడాలన్నారు. పెట్టుబడులు తగ్గించి లాభాలు వచ్చే దిశగా వ్యవసాయం చేయాలన్నారు.

అధికారుల దృష్టికి ఎరువుల కొరత : కనపర్తి

అవనిగడ్డ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో నెలకొన్న ఎరువుల కొరత సమస్యను టీడీపీ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. జిల్లా డాష్ బోర్డులో అన్ని మండలాల్లో ఎరువుల నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని అధికారులు చూపిస్తున్నారని, వాస్తవంగా రైతులకు అవసరమైన యూరియా, డీఏపీ కొరత తీవ్రంగా ఉందని మంగళవారం మంత్రి అచ్చెన్నాయుడు, కమిషనర్ డిల్లీరావు దృష్టికి కనపర్తి శ్రీనివాసరావు తీసుకెళ్లారు. కమిషనర్ డిల్లీరావు ఆదేశాలతో డీఆర్వో చంద్రశేఖర్‌రావు, అవనిగడ్డ తహసీల్దార్ నా గమల్లేశ్వర రావు వెంటనే కనపర్తి శ్రీనివాసరావుతోనూ, రైతు నాయకుడు మిక్కిలినేని మధుతో ఫోన్‌లో మాట్లాడారు. వారిద్దరూ ఎరువుల దుకాణదారుల పెడుతున్న ఇబ్బందులను వివరించారు. ప్రభుత్వంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని డీఆర్వో చంద్రశేఖర్‌రావు హామీ ఇచ్చినట్లు కనపర్తి శ్రీనివాసరావు తెలిపారు.



ఎంఈవో-1గా సలోమి

పెడన, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : పెడన ఎంఈవో-1గా ఎన్.సలోమి నియమితులయ్యారు. మచిలీపట్నం రాంజీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయినిగా పనిచేస్తున్న సలోమిని పెడన ఇన్‌చార్జి ఎంఈవో-1గా పూర్తి అదనపు బాధ్యతలతో నియమిస్తూ కాకినాడ ఆర్జేడీ జి. నాగమణి ఉత్తర్వులు జారీ చేశారు. పదవీ బాధ్యతలు స్వీకరించిన సలోమిని ఎంఈవో-2 వై.వి. హరనాథ్, ఎంఈవో కార్యాలయ ఉద్యోగులు అభినందనలు తెలిపి సత్కరించారు.



పేద విద్యార్థికి రావెళ్ల ఫౌండేషన్ సాయం

చల్లపల్లి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : రావెళ్ల ఫౌండేషన్ ద్వారా పేదలకు సాయమందిస్తున్నట్లు ఫౌండేషన్ అధ్యక్షుడు, చల్లపల్లి డీసీ చైర్మన్ నిడమానూరి దిలీప్‌కుమార్ తెలిపారు. ఆముదార్లంక గ్రామానికి చెందిన పేద విద్యార్థి వేములపల్లి వంశీ విద్యాభ్యాసం కోసం ఫౌండేషన్ చైర్మన్ రావెళ్ల ఉదయ్‌కుమార్ వితరణతో ఐదు వేల ఆర్థికసాయాన్ని విద్యార్థి తల్లి నాగమల్లేశ్వరికి దిలీప్‌కుమార్ అందించారు. తెలుగుయువత జిల్లా ఉపాధ్యక్షుడు మోర్ల శివ, షేక్ నబీఘోరి, జన్ను నాంచారయ్య, బోలెం సాయిబాబు, పఠాన్ జిలానీలు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవ సన్న, చిన్నకారు రైతులకు వరం


ఎస్ఎన్ గొల్లపాలెం పొలాల్లో చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న రైతులు

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : అన్నదాత సుఖీభవ పథకం సన్న, చిన్న కారు రైతులకు ఒక వరమని బందరు మండలం టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం పలు గ్రామాలలో చంద్రబాబు చిత్రపటానికి రైతులు పాలాభిషేకం చేశారు. ఎస్ఎన్ గొల్లపాలెం గ్రామంలో రైతులు తమ పంట పొలాల్లో చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కొనకళ్ల మధుసూదనరావు, కొండేటి సుబ్రహ్మణ్యం, కొనకళ్ల లక్ష్మణస్వామి, బొర్రా శ్యామ్, నవరంగ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా సుపరిపాలనలో తొలిఅడుగు

చల్లపల్లి : రాష్ట్ర ప్రభుత్వ పనితీరును తెలుసుకునేందుకు చేపట్టిన సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమం చల్లపల్లి 67, 68 బూత్‌లలో మంగళవారం జరిగింది. టీడీపీ నేతలు ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. ఆగస్టు 15వ తేదీ నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రభుత్వం కల్పించనుందని తెలిపారు. సూపర్‌సిక్స్ హామీల అమలు సాధన దిశగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఎంపీటీసీ సభ్యురాలు పైడిపాముల స్వప్న, తెలుగుయువత జిల్లా ఉపాధ్యక్షుడు మోర్ల శివ, లీగల్‌సెల్ నేత కొడాలి మురళి, షేక్ నబీ ఘోరి, షేక్ ఇబ్రహీం, పఠాన్ జిలానీ, అనగాని నాగేశ్వరరావు, బావిశెట్టి కనకదుర్గ, మేడికొండ రవిబాబు, చాణక్య, నజరానా తదితరులు పాల్గొన్నారు.


చల్లపల్లిలో కరపత్రాలు అందజేస్తున్న టీడీపీ నేతలు

కాసానగర్‌లో..



మోపిదేవి : అధికారం చేపట్టిన ఏడాదిలో ఇచ్చిన హామీలన్ని నెరవేర్చిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం మంగళవారం సాయంత్రం పెదప్రోలు పంచాయతీ శివారు కాసానగర్‌లో జరిగింది. ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వివరించారు. రావి రత్నగిరి, నాదెళ్ల రాజేష్, నాదెళ్ల శరత్ చంద్ర ప్రసాద్, కేసాని సురేష్, దివి యుగంధరి, మోర్ల జయలక్ష్మి తదితరులు ఉన్నారు.


కోనేరు సెంటర్ వద్ద ధర్నాలో మోదుమూడి రామారావు, ఫిలిప్


పెడనలో ధర్నా చేస్తున్న వామపక్షాల నాయకులు


మోపిదేవిలో ధర్నా చేస్తున్న నాయకులు


ఏఈకి వినతిపత్రం అందజేస్తున్న ఐక్యవేదిక నేతలు

విద్యుత్ చార్జీల దోపిడీ ఆపాలి - స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలి

ప్రజా ఐక్యవేదిక ఆధ్వర్యంలో ధర్నా

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ చార్జీల దోపిడీ ఆపాలని, స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని ప్రజా ఐక్య వేదిక నాయకులు డిమాండ్ చేశారు. కోనేరుసెంటర్‌లో మంగళవారం నిర్వహించిన ధర్నాలో సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు పాల్గొని ప్రసంగించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వై నరసింహారావు మాట్లాడుతూ, కూటమి నాయకులు ఎన్నికల సమయంలో విద్యుత్ చార్జీలు పెంచబోమని, స్మార్టు మీటర్లు ఉండవని వాగ్దానం చేశారని, అధికారంలోకి వచ్చాక అందుకు విరుద్ధంగా సర్దుబాటు పేరుతో అదనపు చార్జీలు వసూలు చేస్తోందన్నారు. స్మార్టు మీటర్లు బిగించడం దుర్మార్గమన్నారు. ఏఐటీయూసీ నాయకులు లింగం ఫిలిప్ మాట్లాడుతూ, ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారన్నారు. సీపీఐ నేత మోదుమూ డి రామారావు, కొడాలి శర్మ పాల్గొన్నారు. పెడన : విద్యుత్ చార్జీల భారాన్ని తగ్గించాలని, స్మార్ట్ విద్యుత్ మీటర్లు బిగించడాన్ని విడనాడాలని డిమాండ్ చేస్తూ మంగళవారం తోటమూల విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఏఈకి వినతిపత్రం సమర్పించారు. సీపీఎం నాయకులు గోరు రాజు, పంచల నరసింహారావు, వాసా గంగాధరరావు, సజ్జా మూర్తిరాజు, సీపీఐ నాయకులు కట్టా హేమసుందరరావు, పేరిశెట్టి ఉమాకాంతం, తుమ్మా చినకొండయ్య తదితరులు పాల్గొన్నారు. చల్లపల్లి : పేద ప్రజలకు భారంగా మారే స్మార్ట్ మీటర్లను రద్దుచేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్ బాబు డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా చల్లపల్లిలో విద్యుత్‌శాఖ కార్యాలయం ఎదుట మంగళవారం ప్రజా ఐక్యవేదిక ఆధ్వర్యంలో వామపక్ష నేతలు, ప్రజాసంఘాల నేతలు ధర్నా నిర్వహించారు. ప్రసాద్‌బాబు మాట్లాడుతూ, విద్యుత్‌భారం ఉండదని ఎన్నికల హామీల్లో చెప్పిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వాగ్దానాన్ని విస్మరించిందని విమర్శించారు. స్మార్ట్‌మీటర్లు బిగిస్తే పగలకొట్టాలని పిలుపిచ్చిన లోకేష్, కూటమి నేతలు నేడు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి గుత్తికొండ రామారావు, సీపీఎం కార్యదర్శి యద్దనపూడి మధు, సీఐటీయూ కార్యదర్శి మహమ్మద్ కరీముల్లా, కాంగ్రెస్ నేత మీర్ రిజ్వాన్, ఎంఎల్ నేత పరుచూరి జనార్దన్ వర్తక సంఘం నేత వరదా హరిగోపాల్, నేతలు మాలెంపాటి కోటేశ్వరరావు, జగ్గవరపు బాబూరావు, మాలెంపాటి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. మోపిదేవి : విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం మోపిదేవిలో ధర్నా నిర్వహించారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన స్మార్ట్ మీటర్లను పగులకొట్టండి అని చెప్పిన కూటమి నాయకులు, ఇప్పుడు అదే బాటలో పయనిస్తూ మీటర్లు ఏర్పా టు చేయటం తగదని ప్రజా సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాన కూడలి నుంచి విద్యుత్ సబ్ స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని విద్యుత్ శాఖ ఏఈ పాండురంగారావుకు అందజేశారు. సీఐటీయూ మండల కార్యదర్శి సిహెచ్.రాజశేఖర్, సీపీఐ నాయకులు బండి రామకృష్ణ, రావి ప్రభు ప్రసాద్, కౌలు సంఘం నాయకులు ఎం.సురేష్, దోనె సహదేవుడు, కర్రా వెంకటేశ్వరరావు, విశ్వనాథపల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. కోడూరు : విద్యుత్ స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని, విద్యుత్ చార్జీల భారాన్ని తగ్గించాలని ప్రజాసంఘాల ఐక్యవేదిక నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం కోడూరు విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద నిరసన తెలియజేశారు. విద్యుత్ శాఖ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. రైతు సంఘం నాయకులు ఆవుల బసవయ్య, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పోలాబత్తిన మోహనరావు, మత్స్యకార్మిక సంఘం నాయకులు కొప్పనాతి తాతయ్య, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పోలినాయుడు, రైతు కూలీ సంఘం నాయకులు సింగోతు నాగేంద్రం, కాంగ్రెస్ పార్టీ నాయకులు కాగితాల సుదర్శన్, రైతు సంఘం నేత రేపల్లె యోగ ప్రకాష్, జొన్నలగడ్డ రాజగోపాల్ పాల్గొన్నారు.


చల్లపల్లి ధర్నాలో మాట్లాడుతున్న ప్రసాద్‌బాబు

వికాస తరంగిణి ఆధ్వర్యంలో చలివేంద్రం



అవనిగడ్డ రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : వేకనూరు ఉషాపద్మిని సమేత సూర్యనారాయణ స్వామి దేవస్థానం ఎదుట వికాస తరంగిణి ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. గత వారం రోజులుగా ఎండలు విపరీతంగా కాస్తున్న నేపథ్యంలో ప్రజల దాహార్తి తీర్చేందుకు అనువుగా చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. వికాస తరంగిణి సభ్యులు పాల్గొన్నారు.

దళితవాడ శ్మశాన వాటిక అభివృద్ధి పనులు ప్రారంభం



చల్లపల్లి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : చల్లపల్లి గ్రామపంచాయతీ నిధులు రూ.7.70 లక్షలు, మండల పరిషత్ నిధులు రూ.7.20 లక్షలతో దళితవాడలో సీసీ రోడ్డు, ప్రహరీ పనులను చల్లపల్లి ఎంపీపీ కోట విజయ రాధిక, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారిలు భూమిపూజ చేసి ప్రారంభించారు. ఎంపీటీసీ పైడిపాముల స్వప్న, మాజీ ఏఎంసీ కొడాలి మురళి, వార్డు సభ్యురాలు కొడాలి రోహిణి, కోట సత్యనారాయణ, పైడిపాముల రాజేంద్ర పాల్గొన్నారు.

జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు వెంటనే ఇవ్వాలి

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన జర్నలిస్టులకు కొత్త అక్రిడిటేషన్లు మంజూరు చేయాలని, ప్రమాద బీమా పాలసీని ఏపీయూడబ్ల్యుజే జిల్లా కన్వీనర్ చలమలశెట్టి రమేష్ కోరారు. ఈ మేరకు డీఆర్వో కె. చంద్రశేఖర్‌కు వినతిపత్రం సమర్పించారు. అక్రిడిటేషన్ల మంజూరులో రెన్యువల్ విధానానికి స్వస్తి పలకాలన్నారు. అక్రిడిటేషన్లు, ప్రమాద బీమా లేక జర్నలిస్టులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. బీహార్‌లో మాదిరిగా విశ్రాంత జర్నలిస్టులకు రూ. 20వేల పెన్షన్ పథకాన్ని వర్తింప చేయాలన్నారు. పి. అశోక్‌కుమార్, నాగేశ్వరరావు, కౌసర్, షరీఫ్, రఫీ, లాజర్, కిషోర్, జాషువా, ప్రసాద్ పాల్గొన్నారు.